J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 10.07.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 06 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



# బీజేపీలో టీడీపీ

## విలీనమే శరణ్యమా...?

- బాబుకి పార్టీని నడిపే సత్తా లేదు
- చినబాబుకి అంతటి సమర్థత రాదు
- నందమూరి వారసులు ఆసక్తిగా లేరు
- బీజేపీకి క్యాడర్ కావాలి
- బాబుకు భరోసా కావాలి
- వైసిపికి ప్రత్యామ్నాయమే లక్ష్యం

11లో



## మీ జ్ఞాపకాలే..

## మా మది నిండా..




మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా జూలై8న ఇడుపులపాయలోని ఆయన సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఇతర కుటుంబసభ్యులు

## పుట్టినరోజున నాన్నకు నివాళి

# వడివడిగా... విశాఖ వైపు అడుగులు పడుతున్నాయి

11లో



- ఈసారి విశాఖలోనే 'విజయదశమి'
- మరో 10 రోజుల్లో పరిపాలనా వికేంద్రీకరణ, సీఆర్డీఏ చట్టం రద్దు బిల్లులకు ఆమోదానికి రంగం సిద్ధం
- రెండోసారి అసెంబ్లీ ఆమోదం తర్వాత కౌన్సిల్ తిరస్కరించినా నెలరోజుల్లో ఆమోదం పొందినట్లే
- గవర్నర్ ఆమోదం తర్వాత కోర్ట్‌కి సమాచారం ఇచ్చి వైజాగ్ తరలేందుకు సిద్ధమౌతోన్న అధికార యంత్రాంగం
- ఇటీవల రెండు రోజుల పాటు డీజీపీ విశాఖలో ఆకస్మిక పర్యటన, చీఫ్‌ఆఫీస్ నిర్మాణం కోసం స్థలాన్వేషణ




## కరోనా కట్టడిలో సైతం..

## సత్తా చాటుతున్న..

# మన సతీష్‌రెడ్డి






కేవలం 12రోజుల్లోనే భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్ సతీష్‌రెడ్డి సారథ్యంలో వెయ్యి పడకలతో 250 ఐసియు బెడ్‌లతో.. అత్యంత అధునాతన టెక్నాలజీతో శరవేగంగా కోవిడ్ ఆసుపత్రిని సిద్ధం చేయడం.. ఆ ఘనత మన నెల్లూరుకు చెందిన గుండ్రా సతీష్‌రెడ్డికి లభించడం ప్రతి నెల్లూరీయుడికీ గర్వకారణం!

(వార్త 12వ పేజీలో)

## ఆత్మకూరు అభివృద్ధికి..

# మాస్టర్‌ప్లాన్ తయారుచేయండి

**- అధికారులకు మంత్రి గౌతంరెడ్డి ఆదేశం**

ఆత్మకూరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా పటిష్టమైన ప్రణాళికలతో మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలని మంత్రి మేకపాటి గౌతంరెడ్డి ఆత్మకూరులోని అన్ని శాఖల అధికారులకు సూచించారు.

ఈనెల 6న ఆయన ఆత్మకూరులోని తన నివాసంలో అన్నిశాఖల ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. వివిధ శాఖల ద్వారా 150 కోట్ల రూపాయలతో చేపడుతున్న అభివృద్ధిపనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. అధికారులు సమ న్వయంతో పనిచేసి ఆత్మకూరు అభివృద్ధికి సహకరించాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రైతుల ఆశలు నెరవేరేలా రెండో పంటకు సాగు నీరు విడుదల చేస్తున్నామని, చివరి ఆయకట్టు వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని నీటిపారుదల అధికా రులకు సూచించారు. త్వరలోనే రామాయ పట్నం పోర్టు నిర్మాణం ప్రారంభం కానుం దని, దానికి సోమశిల జలాలను సర ఫరా చేయాల్సి ఉంటుందని, అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. సోమ శిల నుంచి నీరు విడుదల చేసే సంద ర్భంలో నీళ్ళు వృధా కాకుండా చూడాల న్నారు. ఓఎస్డీలు పెంచలరెడ్డి, చెన్నయ్య, అధికారులు పాల్గొన్నారు.



# మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి

**- ఎమ్మెల్యే కాకాణి**


మూడు రాజధానులతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని, అందు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈనెల 5 న ముత్తుకూరు మండలంలో పేదలకు కేటాయించనున్న ఇళ్ల స్థలాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అర్హులైన అందరికి స్థలాలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంటే, ప్రతిపక్ష నాయకులు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వైయస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేటు ఉపాధ్యాయుల్ని ఆదుకోవాలి

ఈ కరోనా కష్టకాలంలో ప్రైవేటు ఉపాధ్యాయులు తమ కుటుంబాలను పోషించుకోలేక ఎన్నో ఇబ్బందులుపడుతున్నారని, వారిని వెంటనే ఆదుకోవాలని పొదలకూరులోని టిఎన్ఎస్ఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కె.సందీప్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లాక్‌డౌన్ ప్రభావంతో ప్రైవేటు విద్యాసంస్థలు మూతపడ్డాయని, అయినప్పటికీ కొన్ని విద్యాసంస్థల వారు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలుచేస్తున్నారని, ఉపాధ్యాయులకు మాత్రం జీతాలు ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు జీతాలు లేక జీవితాలు గడవక కొందరు అధ్యాపకులు సైతం కూర గాయలు, పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగించే దుర్భర పరిస్థితులు ఏర్పడ్డాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఎన్నో కష్టాలు పడుతున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందిని ఆదుకోవాలని ఆయన కోరారు.

## పెరుగుతున్న నిర్లక్ష్యం..

# అంటుకుంటున్న కరోనా



- జిల్లాలో ఒకేరోజు వంద కేసులు
- 1201కి పెరిగిన బాధితులు
- నగరంలోనూ కోవిడ్ విజృంభణ

***నెల్లూరు జిల్లాలో కరోనా మహమ్మారి విలయతాండవం చేస్తోంది. ఇప్పటికే పెరుగుతున్న కేసులతో నగరం కరోనాకి హాట్‌స్పాట్‌గా మారింది. ప్రజలు, ముఖ్యంగా యువత నిర్లక్ష్యంగా ఉంటూ విచ్చలవిడిగా గుంపులుగా తిరుగు తుండడంతో నగరంలో కూడా కరోనా మోత మోగిస్తోంది. ఎక్కడ చూసినా కంటైన్మెంట్ జోన్‌లే. ఇప్పటికే జిల్లాలో 208 ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్ లుగా ప్రకటించి కరోనా వ్యాప్తి నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుం టున్నారు. అయినప్పటికీ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది.***

జిల్లాలో కరోనా వ్యాధి విజృంభణ కొనసాగుతూనే ఉంది. రోజు రోజుకు కేసులు పెరిగిపోతూనే ఉన్నాయి. అయినప్పటికీ అనేకప్రాంతాల్లో, ముఖ్యంగా నెల్లూరు నగరంలో అత్యధికశాతం మంది యువత, ప్రజలు ఎంతో నిర్లక్ష్యంగా ఉంటుండడం కనిపిస్తూనే ఉంది. ప్రాణాంతకమైన కరోనా వ్యాధిపట్ల ఏమాత్రం ముందుజాగ్రత్తలు పాటించడం లేదు. ఎక్కడ చూసినా విచ్చలవిడిగా తిరుగుతూనే ఉన్నారు.

### 7న ఒక్కరోజే..100 కేసులు :

ఈనెల 7వ తేది మంగళవారం ఒక్కరోజే జిల్లావ్యాప్తంగా వంద పాజిటివ్ కేసులు నమోదయ్యాయంటే కరోనా ఎంతగా విశ్వరూపం చూపుతోందో అర్థమవుతోంది. ఈనెల 6న వచ్చిన 62 కేసుల్లో 24 మంది నగరవాసులే. ఈనెల 7వ తేది నాటికి జిల్లాలో కరోనా బాధితుల సంఖ్య 1070 నుంచి ఒక్కసారిగా 1170కి చేరుకుంది. జిల్లాలోని కోవూరు, గంగవరం, ముత్తుకూరు, బాలాయపల్లి, సంగం పక్కన సిద్దీపురం, బోగోలు పక్కన కడనూతల, దగదర్తి, సూళ్ళూరుపేట వద్ద ఉన్న వట్రపాళెం, నాయుడుపేటలలో ఒక్కొక్క కేసు, గూడూరు పట్టణంలో 4, వెంకటగిరిలో 8, చిల్లకూరులో 2, తడ సమీపంలోని చేనిగుంటలో 4, కావలి పట్టణంలో 4 కేసుల వంతున నమోదయ్యాయి. ఈనెల 8న మళ్ళీ జిల్లాలో మరో 31 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

### నగరంలో ఎటుచూసినా.. కరోనా :

నెల్లూరు నగరంలో కరోనా మరింతగా అంటుకుంటోంది. ఈనెల 7నాటికి నెల్లూరులోని వేదాయపాళెంలో 8 కేసులు నమోదు కాగా, దర్గామిట్టలో 5, సంతపేటలో 15, యడ్లవారివీధిలో 2, రేబాలవారివీధిలో 1, పద్మావతి సెంటర్‌లో 1, పొదలకూరురోడ్డులో 4, బీవినగర్‌లో 2, కపాడిపాళెంలో 3, వనంతోపులో 1, బాలాజీనగర్‌లో 2, మూలాపేటలో 1, చిల్డ్రన్స్‌పార్క్ వద్ద 1, కోటమిట్టలో 2, డైకస్‌రోడ్డులో 3, పడారుపల్లిలో 1, హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద 1, దొరిపర్తివారివీధిలో 1, పాత జుబ్లీ ఆసుపత్రిరోడ్డు వద్ద 1, జెండా వీధిలో 1, రాంనగర్‌లో 1, బుజబుజనెల్లూరులో 2 వంతున కేసులు నమోదయ్యాయి. ఈ మహమ్మారి వ్యాధి బారిన పడి ఇప్పటికే 21 మంది మరణించారు. అయితే కోలుకుంటున్నవారి సంఖ్య పెరుగుతుండడం ఎంతో ఆశాజనకంగా ఉంది. ఈ వ్యాధి నుంచి కోలుకున్నవారి సంఖ్య 600కు చేరింది. ఐసో లేషన్ కేంద్రాల్లో 487 మంది, క్వారంటైన్‌లలో మరో 154 మంది చికిత్స పొందుతున్నారు. ఈనెల 8న నగరంలో మరో 23మందికి కరోనా సోకింది. నేతాజీనగర్‌లో 11 మంది, ఎన్టీఆర్ నగర్‌లో ఇద్దరు, నవాబుపేటలో ముగ్గురు, దర్గామిట్టలో నలుగురు, మూలాపేటలో ఒకరు, రాంజీనగర్‌లో మరొకరు కరోనా బారిన పడ్డారు.

### ఉద్యోగులను వణికిస్తోన్న కరోనా :

నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కూడా కోవిడ్ వైరస్ విజృం భిస్తుడడంతో ఇప్పటికే 17 మందికి ఈ వైరస్ సోకినట్లు సమాచారం. వీరి ద్వారా వారి కుటుంబసభ్యులైన కొంతమందికి కూడా ఇది వ్యాపించినట్లు తెలుస్తోంది. అదేవిధంగా ఆర్టీసి ఉద్యోగులనూ కరోనా వణికిస్తోంది. ఇప్పటికే 14 మంది ఆర్టీసి ఉద్యోగులకు ఈ వ్యాధి సోకడం, ఇద్దరు అధికారులకు పాజిటివ్ రావడం, ఒకరు మృతి చెందడంతో ఆర్టీసి వర్గాలు తీవ్ర ఆందోళనలో ఉన్నాయి. నెల్లూరు ఆర్టీసి బస్టాండ్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో పనిచేసే ఒక ఉద్యోగి అనారోగ్యంతో మరణిస్తే ఆయనకు పరీక్షలు నిర్వహిస్తే కరోనా అని తేలింది. ఆయనకు సన్నిహితంగా ఉన్న ఉద్యోగులు కొందరికి కూడా కరోనా సోకినట్లు బయటపడింది. ఇద్దరు డిపో అధికారులకు కూడా కరోనా నిర్ధారణ కాగా వారిని ఐసోలేషన్‌కు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. అదేవిధంగా నగరంలోని ఆర్టీసి బస్టాండ్‌లో జూనియర్ సహాయకునిగా పనిచేస్తున్న ఒకరికి కరోనా సోకడంతో, ఆ కార్యాలయంలోని 11 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా, వారిలో 10 మందికి పాజిటివ్ రావడంతో మొత్తంగా 14 మంది ఉద్యోగులు కరోనాతో బాధలుపడుతూ బెంబేలెత్తిపోతున్నారు. ఈనెల 8న ఆర్టీసి 1వ డిపోలో పనిచేస్తున్న మరో ముగ్గురికి కరోనా సోకింది. అంతేకాదు, 28 మంది పోలీసులకు కరోనా సోకగా, అందులో 9 మంది కోలుకున్నారు. మరో ఏడుగురు రేపోమాపో డిశ్చార్జి కానున్నారు. వైరస్ బారిన పడిన సిబ్బందికి వారి కుటుంబాలకు జిల్లా ఎస్పీ తదితర అధికారులంతా ధైర్యం చెప్తూ బాసటగా నిలుస్తున్నారు. కరోనా నిరోధానికి జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు రేయింబవళ్ళు కంటికి నిదురలేకుండా శ్రమిస్తున్నా, వైద్యులు అహరహం వ్యాధిగ్రస్తులకు చికిత్సలు అందిస్తూనే ఉన్నా.. కరోనా నానాటికీ పెరిగిపోతూనే ఉండడం కలవరం కలిగిస్తోంది. ఇకనైనా ప్రజలంతా ఎవరికి వారు స్వీయనియంత్రణ పాటించి ముందు జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి అవసరం.

## కాలానికి కుట్లువేసి...

కార్పొరేట్ కబళింపు
వృత్తిత్వాన్ని ఆవహించాక
నైపుణ్యత టోకుగా అమ్మకం వస్తువై
యాజమాన్యం అవిటిదై
మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాక
ఇప్పుడు వాళ్ళ అంతస్తుల ముళ్ళకంచెల మీద
దర్జా దర్జీల గుడ్డల వెల్లువ
ఎక్కడిదో దగాపడ్డ గావు కేక
మరోప్రక్క డప్పుల మోత
జనసంద్రానికి హుందాను పులిమే
కడలిలో కల్లోల తుఫాను పుట్టింది
ఓ నైరాశ్యపు హోరును మోసుకొచ్చింది
మనిషి మానాన్ని దాచే సేవాసదనం
ముత్తైదుతనాన్ని కోల్పోయి
కాలం పహారాలో విధవరాలైన దుర్ఘటన
సిద్ధాన్నంగా సంసిద్ధమైన పోటీతో
సౌభాగ్యం సగం తెల్లారాక
సూక్ష్మత్వం మిగతా బ్రతుకును కాటేసింది
కాలానికి కుట్లువేసి వడిసిపట్టే
నాగరికత నేర్పించే వ్యక్తిత్వం నుంచి
సమయం పలాయనం చిత్రగించింది
గమ్యం తెలియని బాటసారికి
దాహం తీర్చే చలివేంద్రం కావాలిప్పుడు
చిరుగుబొంతల ప్రాణదీపాన్ని వెలిగించే
సరికొత్త వ్యవస్థ చిగురులు తొడగాలి
మనుషులు నగ్నత్వానికి బానిసలై
పేలికల ప్యాంట్లు, అరకొర జాకెట్లహోరుతో
ఉరితీయబడ్డ మానం వెక్కిరిస్తే
జనం పట్ల నీ కృతజ్ఞత ఉపసంహరించుకోకు
నిన్ను నువ్వు నిమ్మళించుకో
అచేతనావస్థ నుండి
చీకటిశక్తితో
రేపటి ఉషోదయాన్ని
ఆవిష్కరించుకో!...



**- చిన్ని నారాయణరావు**
9440202942




## నెల్లూరుతో ఆత్మీయ బంధం...

# నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం

### మల్లారెడ్డి ఐపిఎస్.. పదవీ విరమణ



***ఎంతోమంది అధికారులు జిల్లాకు వస్తుంటారు, బదిలీపై వెళ్లిపోతుంటారు. అయితే కొద్దిమంది మాత్రమే తమ ముద్రను తమ పాలనలో చూపించి జిల్లా చరిత్రలో చిరస్మరణీయులవుతారు. అలా కొంతమంది ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు నెల్లూరు జిల్లాతో కూడా ఆత్మీయ బంధాన్ని పెనవేసుకుని వెళ్లారు. అలాంటి కొద్దిమందిలో ఒకడే మల్లారెడ్డి ఐపిఎస్.***

2007 అక్టోబర్ 15 నుండి 2010 ఫిబ్రవరి 13 వరకు రెండున్నర సంవత్సరాల పాటు నెల్లూరుజిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా జిల్లాలో సుదీర్ఘ కాలం పనిచేసి అజాతశత్రువుగా, సమర్ధనీయ అధికారిగా జిల్లావాసుల ప్రశంసలందుకున్న వ్యక్తి ఆయన.

మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డిపై నక్సలైట్లు హత్యాయత్నం జరిపిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టాడు మల్లారెడ్డి. ఆయన వచ్చినప్పటి నుండి జిల్లాలో సుహృద్భావ వాతావరణం ఏర్పడింది, అందరికి అందుబాటులో వుంటూ పిలిస్తే పలికే అధికారిగా ఆయన మన్ననలను అందుకున్నాడు. ముఖ్యంగా ఆయన జిల్లా ఎస్‌పిగా వున్న సమయంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి పలుమార్లు జిల్లాకు వచ్చి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియా గాంధీతో పాటు రాహుల్ కూడా అప్పట్లో జిల్లాలో పర్యటించారు. శాంతి భద్రతలను పరిరక్షించడంతోపాటు జిల్లాకి వచ్చే విఐపిల భద్రత వ్యవహారంలో కూడా మల్లారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు.

2009లో జరిగిన ఎన్నికలలో ఎక్కడా ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరక్కుండా చూసుకోవడంలో ఆయన చూపిన ప్రతిభ ప్రశంసనీయం.

2009లో రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్ నెల్లూరులో ఆయన ఆధ్వర్యంలోనే జరిగాయి.

సాధారణంగా రాజకీయ పార్టీలు, ముఖ్యమంత్రులు, మంత్రులు మారినప్పుడు జిల్లా స్థాయి అధికారులను మారుస్తారు కానీ, వైయస్ ఆకస్మిక మరణానంతరం చోటు చేసుకున్న అనేక మార్పులలో సైతం మల్లారెడ్డి నెల్లూరులోనే కొనసాగాడు. 2010లో వైయస్ సొంత జిల్లాలో జరిగిన కొన్ని పరిణామాల వల్ల నెల్లూరు నుండి ఆయన కడప ఎస్‌పిగా బదిలీ అయ్యారు.

1987లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌తో పోలీస్ శాఖలో చేరి ఆళ్లగడ్డ, మహబూబ్ నగర్, కడప, కర్నూల్, గద్వాల, నర్సింపేటలలో డియస్‌పిగా పనిచేశాడు. 1998లో ఐపిఎస్‌గా పదోన్నతి పొందారు. అదే మహబూబ్‌నగర్‌తో పాటు వరంగల్, తిరుపతి, విశాఖపట్నంలలో అడిషనల్ ఎస్‌పిగా కూడా విధులు నిర్వహించాడు.

మళ్ళీ కర్నూలు, కడప జిల్లాలతో పాటు నెల్లూరులో ఎస్‌పిగా సేవలందించి తనదైన ముద్రను వేసుకున్నాడు.

హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో డీసీపీ ట్రాఫిక్, జాయింట్ సిపి హెడ్ క్వార్టర్స్‌తో పాటు స్పెషల్ బ్రాంచ్‌లో కూడా పనిచేశారు. డిఐజి వరంగల్‌గా రెండు సంవత్సరాలు పనిచేసిన అనంతరం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఐజి మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా 2016 నుండి 2020 వరకు సుదీర్ఘకాలం పని చేసి జూన్ 30, 2020న పదవీ విరమణ పొందాడు. పోలీసు శాఖలో 33 సంవత్సరాల తన ప్రస్థానంలో 1997లో పోలీస్ సేవా పతకాన్ని, 2004లో యూఎన్ పీస్ మెడల్‌ని, 2012లో ఇండియన్ పోలీస్ మెడల్‌ని తన సొంతం చేసుకున్నాడు మల్లారెడ్డి.

#### ప్రత్యేక సుగుణాలు....

ఆయనకు తెలుగు అంటే మహా ఇష్టం, తెలుగు వారన్నా చాలా ప్రేమ , తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడైనప్పటికీ రాష్ట్రం విడిపోకూడదని, తెలుగువారంతా కలిసే ఉండాలని ఎక్కువగా కాంక్షించేవాడు. ఎక్కడ పనిచేసినా అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులోనే జరిపేవాడు. తన సంతకం కూడా తెలుగులోనే పెట్టేవాడు, సాహిత్యం అంటే మక్కువ ఎక్కువ. ముఖ్యంగా వైయస్ కుటుంబంతో ఆయనకు మంచి సంబంధాలున్నాయి, వైయస్ మరణానంతరం సైతం వారి కుమారుడు, ప్రస్తుత ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కూడా మల్లారెడ్డి ఆప్తుడే. మల్లారెడ్డి ఎక్కడ పనిచేసినా అక్కడ స్థానికంగా కొంతమంది మిత్రులను తరచూ కలుసుకునేవాడు, అలా పరిచయం అయిన వారందరినీ ఇప్పటికీ అప్పుడప్పుడూ పలకరిస్తూ ఈ రోజుకీ వారందరితో అదే సన్నిహిత స్నేహ బాంధవ్యాన్ని కొనసాగిస్తున్నాడు.

నెల్లూరుతో కూడా అలాంటి ఆత్మీయ బంధాన్ని పెనవేసుకుని, పదవి నుండి విరమణ పొంది విశ్రాంత జీవితాన్ని గడుపుతున్న మల్లారెడ్డికి నెల్లూరీయుల తరపున 'లాయర్' అభినందన శుభాకాంక్షలు.

## సునీల్ చేతికి 'నెల్లూరు క్లబ్' పెత్తనం



నెల్లూరు క్లబ్ కొత్త అధ్యక్షుడిగా ఇసనాక సునీల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాడు. క్లబ్ అధ్యక్షుడిగా వుండిన ఫణి ప్రసన్నకుమార్‌రెడ్డి దివంగతులు కావడంతో ఈ బాధ్యతలను సునీల్ చేపట్టాడు.

సునీల్ యువకుడు, ఉత్సాహవంతుడే కాకుండా నెల్లూరు క్లబ్ లాంటి సంస్థలను లాభాల బాట పట్టించడానికి కావలసిన ప్రణాళికలను రూపొందించగలిగిన దిట్ట కూడా. గతంలో ఇక్కడ మద్యపాన ప్రియుల కోసం పానశాల(బార్) లైసెన్సును తెప్పించడంలో సునీల్ కృషి వుంది. స్వతహాగా సినిమా నిర్మాత, నటుడే కాకుండా రియల్ ఎస్టేట్ రంగంలో కూడా విశేష అనుభవమున్న సునీల్‌కి వివిధ రంగాలలో ఉండేవారి అభిరుచులు బాగా తెలిసుండడడంతో, సునీల్ నాయకత్వంలో నెల్లూరు క్లబ్‌కి పూర్వ వైభవం వస్తుందని సభ్యులు ఆశాభావం వ్యక్తపరుస్తున్నారు.

బాధ్యతలు చేపట్టిన వెంటనే, క్లబ్‌ని ఫామిలీ క్లబ్‌గా మార్చడానికి అవసరమైన రెస్టారెంట్, యాంఫి థియేటర్(ఓపెన్ ఎయిర్) స్విమ్మింగ్‌పూల్ వంటి వసతుల పైన దృష్టి పెట్టాడని సమాచారం. ఈ క్లబ్‌లో అవలంబిస్తున్న విధానాలు, జరుగుతున్న అవినీతి, పాత కమిటీ నిర్లక్ష్య ధోరణి పట్ల గతంలో అనేక పర్యాయాలు సునీల్ తన నిరసన గళాన్ని వినిపించాడు. ఇప్పుడు సునీలే అధ్యక్షుడయ్యాడు కాబట్టి ఇక క్లబ్బుకి అన్నీ మంచి రోజులే అన్నది సభ్యుల ఆశ. బెస్ట్ ఆఫ్ లక్ టు సునీల్.

# బడుల మూత... ఫీజుల కోత

- ఆన్‌లైన్‌లో తరగతులు..
- కొందరికే జీతాలు
- ఫీజులు కట్టని తల్లిదండ్రులు...
- స్పష్టత ఇవ్వని ప్రభుత్వాలు
- స్పష్టంగా ఉండాలంటున్న కోర్టులు
- అయోమయంలో అధ్యాపకులు




## విద్యా వ్యవస్థకి కొత్త అవస్థలు

***మనం కేవలం ప్రైవేటు స్కూళ్లలో వారందించే రాజభోగాలకు ఫీజులు చెల్లిస్తున్నామా లేక వారు నేర్పించే చదువులకు గురుదక్షిణ ఇస్తున్నామా...? ఇది ఇప్పుడు ప్రతీ అమ్మా నాన్నా ఆలోచించుకోవాల్సిన సమయం. మీ స్కూలుకు అంత కడుతున్నాం, మీ చదువులకి ఇంత ఖర్చు పెడుతున్నాం అంటూ పిల్లల ముందే పాఠశాలలను వాటి యజమానులను దోపిడీదారులుగా మాట్లాడే ప్రతి తల్లి, తండ్రికి ఇది ఆచి తూచి అడుగు వేయాల్సిన తరుణం.***

తమ బిడ్డలు కార్పొరేట్ బళ్ళలో చదవాలి, వారి చదువుల విషయంలో తామెక్కడ రాజీ పడకుండా వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిని మంచి పేరున్న బళ్ళలో చదివించాలి, ఇందుకోసం తాము పస్తులు వుండైనా తమ బిడ్డల బడి ఫీజులు కట్టాలి... అని ఆలోచించే ఎంతో మంది మధ్యతరగతి కుటుంబాల వారి బలహీనతలను సొమ్ము చేసుకున్న స్కూళ్ల పరిస్థితి కూడా ఇప్పుడు దయనీయంగా మారింది.




బళ్ళులేవు, బస్సులు లేవు, వ్యాన్లు లేవు, యూనిఫారాలు లేవు... కానీ చదువులు మాత్రం కొనసాగుతున్నాయి. మొన్నటి వరకూ పిల్లలని రెడీ చేసి స్కూలుకు పంపి చేతులు దులుపుకుంటుండిన తల్లులు ఇప్పుడు వాళ్ళు కూడా రెడీ అయ్యి ఆన్‌లైన్ క్లాసులకు పిల్లలతోపాటు హాజరవుతున్నారు. తమ పిల్లలు ఎలా ఫాలో అవుతున్నారో వాళ్ళు కూడా తెలుసుకుంటున్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితులలో తమ విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తుపై స్కూళ్ల యాజమాన్యాలు కూడా ప్రత్యేకదృష్టి పెట్టాల్సొస్తుంది. పూర్తిస్థాయిలో తమ సిబ్బందిని వినియోగించుకోవడం ఇబ్బంది కాబట్టి అవసరమైన మేరకే వారి సేవలని వాడుకోవాలి. ఇప్పటికే కొన్ని స్కూళ్ళు ఆ పనిలో పడ్డాయి.

అవసరమైన మేరకే బోధనా సిబ్బందిని ఎంపిక చేసుకుని వారిద్వారా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తూ వారి వరకు మాత్రమే జీతభత్యాలు చెల్లిస్తున్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని, తామిచ్చే అన్ని వసతులు వాడుకోవడంలేదు కాబట్టి కేవలం బోధనలని దృష్టిలో ఉంచుకుని 20 నుండి 40 శాతం ఫీజులు మాత్రమే చెల్లిస్తే చాలని తాము పేరెంట్స్‌కి సూచించినా చెల్లింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయని స్కూళ్ల నిర్వాహకులు వాపోతున్నారు.

మా పిల్లలు స్కూలుకి రావడంలేదు కదా మేమెందుకు ఫీజులు చెల్లించాలి అని కొందరు, స్కూళ్ళు తెరిచినప్పుడు చూద్దాం లేండి అని మరి కొందరు ఆన్‌లైన్ క్లాసులకు అంతెందుకు అని ఇంకొందరు మొత్తం మీద ఆన్‌లైన్ క్లాసులు వాడుకుంటున్న వాళ్లలో 70 శాతంమంది ఫీజులు చెల్లించడానికి సుముఖత చూపించడం లేదు.

#### అయోమయంలో స్కూళ్ళ యాజమాన్యాలు

ఇలాంటి స్థితిలో స్కూళ్ల యాజమాన్యాల పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని, అటు పేరెంట్స్‌ని ఒప్పించలేక ఇటు సిబ్బందిని తప్పించలేక అయోమయ పరిస్థితులలో తామున్నామని వారు చెప్తున్నారు. ప్రైవేటు స్కూళ్లంటే ఫీజుల మోత... వసూళ్ళ వాత అనే భ్రమలో వున్న తల్లితండ్రులు వాస్తవ పరిస్థితులను అర్ధం చేసుకోకుండా తమని ఇలా ఇబ్బంది పెడితే భవిష్యత్తులో, ఉన్నత విలువలతో క్రమశిక్షణతో కూడిన విద్య కరువైపోతుందని వారు ఆవేదన చెందుతున్నారు.

మరోవైపు ప్రభుత్వాల నుండి కూడా ఆన్‌లైన్ క్లాసులపై స్పష్టమైన ఆదేశాలు రావడం లేదు. ఒక్కో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఇంకోవైపు కోర్టులు కూడా ఆన్‌లైన్ క్లాసులపై మీ విధానాలేమిటంటూ అటు స్కూళ్ళ యాజమాన్యాన్ని, ఇటు ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ఈ అయోమయానికి తెరదించాలని సూచిస్తున్నాయి.

యాజమాన్యం, తల్లితండ్రులు ఇద్దరూ మారాలి, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పట్టువిడుపులతో ఉభయతారకంగా ఒక ఒప్పందానికి రావాలి, స్కూళ్ళు పూర్తిస్థాయిలో తిరిగి తెరుచుకోవడం ఈ విద్యా సంవత్సరం అసాధ్యమే. ఇలాంటి తరుణంలో పిల్లల భవిష్యత్తుతో పాటు అధ్యాపకుల భవిష్యత్తు కూడా ప్రశ్నార్ధకం కాకుండా తల్లితండ్రులు, స్కూల్ నిర్వాహకులు సంయమనంతో వ్యవహరించి నిర్ణయం తీసుకోవాలి. కరోనా కష్టకాలంలో వ్యాపార దృక్పధాలు పక్కన పెట్టి సామాజిక బాధ్యతతో స్కూళ్ళు వ్యవహరించాలి. మెడమీద కత్తిపెట్టి వసూళ్లు చేసే విధానానికి స్వస్తి పలకాలి. తల్లితండ్రులు సైతం గతానుభవాలను పక్కనపెట్టి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సహకరించాలి. అప్పుడే రేపటి పౌరులకు న్యాయం జరుగుతుంది, లేదంటే నాణ్యమైన విద్య ప్రశ్నార్ధకమే అవుతుంది.

## 'ప్రభా'తం

# తొలగిన ప్రతిష్టంభన

సరిహద్దుల్లో శాంతిస్థాపన అనివార్యమని, ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాలని తాజాగా చైనా-భారత్‌లు ఏకాభిప్రాయానికి రావడం, విభేదాలు వివాదాలుగా మారకూడదని, చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలని, శాంతిస్థాపన దిశగా అడుగులు వేయాలని ఇరుదేశాలు నిర్ణయించుకోవడం ఎంతైనా శుభపరిణామం. సరిహద్దుల్లో శాంతి స్థాపనకు ఇది మేలుబాటలు వేసే పరిణామమేని భావించవచ్చు. ఇది భారత్ దౌత్యవిజయానికి కూడా నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

సరిహద్దుల్లో యుద్ధవాతావరణం ఏర్పడడంతో ఎప్పుడు ఏమవుతుందోనని ప్రపంచమంతా కలవరపడుతున్న వేళ..ఎట్టకేలకు లద్దాఖ్‌లో సరిహద్దు ప్రతిష్టంభన తొలగింది. గాల్వాన్ లోయనుంచి చైనా బలగాలు వెనక్కితగ్గాయి. సుమారు కిలోమీటరు దూరం పైగానే వెనక్కి వెళ్ళాయని, గాల్వాన్ పెట్రోలింగ్ పాయింట్ వద్ద సైనికులు ఏర్పాటుచేసుకున్న గుడారాలు కూడా తొలగిపోయాయని, ఇరుదేశాల ప్రతినిధుల తాజా చర్చలతో.. సుమారు రెండు కిలోమీటర్ల దాకా రెండుదేశాల సైన్యం వెనక్కు మళ్ళినట్లు సమాచారం. దీంతో వాస్తవాధీన రేఖ వద్ద గత రెండు నెలలుగా ఏర్పడిన ఉద్రిక్తత ప్రస్తుతానికి సద్దుమణిగినట్లయింది.

సరిహద్దుల్లో శాంతిస్థాపన అనివార్యమని, మరింతగా ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించాలని చైనా - భారత్‌లు ఏకాభిప్రాయానికి రావడం, విభేదాలు వివాదాలుగా మారకూడదని, చర్చలతో పరిష్కారం దిశగా అడుగులు వేయాలని నిర్ణయించుకోవడం ఎంతైనా శుభపరిణామం. లద్దాఖ్ తూర్పు ప్రాంతం లోని ఫింగర్-4 పాయింట్ నుంచి చైనా దళాలు వెనక్కి వెళ్లడం భారత్ దౌత్య విజయానికి మరో సంకేతం. గతనెల 15న గాల్వాన్ లోయ ప్రాంతంలో జరిగిన ఘర్షణలో భారత సైనికులు 20 మంది వీరమరణం పొందిన విషయం అందరికీ తెలిసిందే. ఇంతకంటే ఎక్కువమంది చైనా సైనికులు మరణించినట్లు అందరూ భావిస్తున్నా, ఆ వాస్తవాన్ని ఇప్పటికీ చైనా అంగీకరించలేకపోవడం ఏమిటో ఎవరికీ అర్థం కాని విషయం. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 3న తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్‌లోయలో ఆకస్మికంగా పర్యటించడం, తన ఉత్తేజితమైన ప్రసంగం ద్వారా చైనాకు ఘాటైన సంకేతాలివ్వడంతోనే చైనా దిగివచ్చిందని వేరే చెప్పనక్కరలేదు.

'ఇది అభివృద్ధి యుగం. ప్రాదేశిక విస్తరణ వాదానికి కాలం చెల్లిపోయింది. విస్తరణవాద శక్తులు ఓటమిని లేదా వినాశనాన్ని చవిచూడడం ఖాయం. ఇది చరిత్ర చెప్తున్న సత్యం'.. అంటూ గళమెత్తి గర్జించిన ప్రధాని మోదీ హెచ్చరికలు చైనాపై బాగానే ప్రభావం చూపినట్లున్నాయి. మోడీ లద్దాఖ్‌లో పర్యటించిన రెండురోజుల్లోనే చైనా సైనిక బలగాలు వెనక్కిమళ్ళడం విశేషం. గత రెండు నెలలుగా సరిహద్దుల్లో పొంచివుండి ఘర్షణలకు దిగుతున్న చైనా ఇప్పుడు తాజా చర్చలతో బలగాలను వెనక్కిమళ్ళించడానికి తలూపిందంటే అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పెరుగుతున్న మద్దతు, ప్రధాని మోడీ చేసిన ఘాటైన హెచ్చరికలు కూడా ఒక ముఖ్య కారణం అనుకోవచ్చు.

సరిహద్దు చర్చల్లో భారత్- చైనా దేశాల ప్రత్యేక ప్రతినిధులుగా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యీల మధ్య తాజాగా జరిగిన చర్చలు ఫలవంతం కావడంతో సరిహద్దుల్లో శాంతి సుమాలు వికసించేందుకు మార్గం సుగమమైంది.

అజిత్ దోభాల్, వాంగ్‌యీల మధ్య దాదాపు రెండుగంటల పాటు జరిగిన టెలిఫోన్ వీడియోకాల్ చర్చలు ఇరుదేశాల మధ్య శాంతికి దారులు తీసినట్లయింది. ఎలాంటి జంకుగొంకు లేకుండా నిర్భయంగా మాట్లాడే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ రంగంలోకి దిగిన తర్వాతనే ఈ చర్చల ప్రక్రియ వేగవంతం అయినట్లు కూడా తెలుస్తోంది. సరిహద్దుల్లో శాంతి నెలకొనాలంటే ముందుగా బలగాల ఉపసంహరణ జరగాలని, అభిప్రాయ భేదాలు ఘర్షణలుగా మారకుండా జాగ్రత్తపడాలని, ఇరుదేశాల ప్రతినిధులు ఒక అంగీకారానికి రావడంతో రెండు దేశాల సరిహద్దుల మధ్య రాజుకున్న వేడి చల్లారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ద్వైపాక్షిక సంబంధాలు మరింత ముందుకు సాగాలంటే సరిహద్దుల్లో శాంతి నెలకొనడం అత్యవసరమని ఇరువురూ ఏకాభిప్రాయానికి రావడంతో ఎట్టకేలకు సరిహద్దుల్లో ప్రతిష్టంభన తొలగినట్లైంది. ఈ విషయాలపై ఇరుదేశాల మధ్య సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అనంతర పరిణామాలతో గల్వాన్ లోయ నుంచి చైనా దళాలు వెనక్కుమళ్లడంతో ఉద్రిక్తతలు సద్దుమణిగినట్లయింది. అయితే, గత అనుభవాల దృష్ట్యా.. వాళ్ళు వెనక్కి వెళ్ళినట్లే వెళ్ళి మళ్ళీ రావచ్చుననే సందేహాలున్నా, చైనా బలగాలు వాస్తవానికి ఎంత దూరం వెనక్కి మళ్ళాయో ఖచ్చితంగా తెలియకపోయినా, ఇప్పుడున్న ఉద్రిక్తపరిస్థితుల్లో ఇరుదేశాల బలగాల ఉపసంహరణ మంచి పరిణామమేనని వేరే చెప్పనవసరం లేదు. లడఖ్ తూర్పు ప్రాంతంలో చైనా దళాలు ఇప్పటికే దాదాపు ఒకటిన్నర కిలోమీటరు దూరం వెనక్కి మళ్ళాయని మన సైనిక బలగాలు చెప్తున్నాయి. వివాదాస్పద ప్రాంతాల నుంచి చైనా బలగాల ఉపసంహరణ ప్రక్రియను భారత్ నిశితంగా పరిశీలిస్తూనే ఉంది కూడా. ఏదేమైనా ఇది భారత్ దౌత్యవిజయానికి, ప్రత్యేకించి మోడీ సంకల్పశక్తికి.. అజిత్ దోభాల్ దౌత్యం ప్రత్యేకతకు ప్రతీకగా కూడా చెప్పుకోవచ్చు.

మరోవైపు చూస్తే.. ప్రస్తుత పరిస్థితుల్లో చైనాకు పాకిస్థాన్ మినహా నమ్మదగ్గ మిత్రదేశాలు కూడా ఏమీ లేవు. అమెరికా చూస్తేనా.. కరోనా దెబ్బతో చైనాపై గుడ్లురుముతోంది. కమ్యూనిస్టు దేశమైన రష్యా కూడా ఇప్పుడు చైనా ధోరణిని వ్యతిరేకిస్తూనే ఉండడం తెలిసిందే. ఇక విధిలేని పరిస్థితుల్లో ఇరుగుపొరుగు దేశాలైన నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి చిన్న దేశాలను చైనా భారత్‌పైకి ఉసిగొల్పుతున్నప్పటికీ ఆ ప్రయత్నాలేమీ ఫలించడం లేదు.

కరోనా వ్యాప్తికి చైనాయే కారణమంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడుతుండడంతో చైనాతో ఉన్న సన్నిహిత దేశాలు కూడా చైనా ధోరణి పట్ల ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. దీంతో దారులన్నీ మూసుకుపోవడంతో చైనా పరిస్థితి ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో చైనా అడుగు ముందుకు వేయలేని స్థితిని కలిగించడంలో భారత్ సఫలీకృతమైందని అనుకోవచ్చు.

ఏదేమైనా భారత్-చైనాల మధ్య ఉద్రిక్తతలు మరింత జటిలమైన వాతావరణానికి దారితీస్తాయేమోనని అందరూ ఆందోళన చెందుతున్న సమయంలో అజిత్ దోభాల్ చర్చలు ఫలవంతం కావడం.. శాంతి సామరస్యాలతో ముందుకు సాగాలని ఇరుదేశాలూ నిర్ణయించుకోవడం మంచి పరిణామమే!

---

### టిటిడి బోర్డు సమావేశం ప్రత్యక్షప్రసారం

## భేషైన నిర్ణయం

తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్‌గా వైవి సుబ్బారెడ్డి గారు బాధ్యతలు చేపట్టినప్పటినుండి, అనేక సంచలనాత్మక సంస్కరణలను చేపట్టి, సామాన్య భక్తులకు స్వామివారిని చేరువ చేశారు. కరోనా కష్ట సమయంలో సైతం భక్తులకు అవసరమైన వసతులు కల్పించడంలో ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తూ ఎక్కడా భక్తులు నిరుత్సాహానికి లోనుకాకుండా స్వామివారి దర్శనం చేసుకునే భాగ్యం కల్పిస్తున్నారు.

ఇప్పుడు కొత్తగా మరో గొప్ప నిర్ణయం తీసుకున్నారు. ఇకపై జరిగే టిటిడి ట్రస్టు బోర్డు సమావేశాలను ఎస్‌విబిసి ఛానల్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చెయ్యాలని అధికారులను ఆదేశించారు.

భక్తుల మనోభావాలను కాపాడుతూ, వారి ఆకాంక్షలను తీర్చే బాధ్యత టిటిడి ట్రస్ట్ బోర్డుపై ఉంది కాబట్టి, సమావేశంలో జరిగే కార్యకలాపాలు ప్రత్యక్ష ప్రసారము ద్వారా భక్తులకు తెలియాలన్నది అయన ఆలోచన. కేవలం దర్శనాలే ప్రధానం కాకుండా తాను ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటినుండి అన్ని కోణాలలో తిరుమలను ప్రజలకు చేరువ చెయ్యాలన్న సుబ్బారెడ్డిగారి ప్రయత్నం అభినందనీయం. ట్రస్టు బోర్డు సమావేశాలు ప్రత్యక్ష ప్రసారం చెయ్యాలన్నది భేషైన నిర్ణయం.

**కెవిఎస్ఎన్ భూషణం, తిరుపతి.**




### ఎన్‌సిసి కాలనీలో

## కోతుల బెడద

నెల్లూరు పొదలకూరురోడ్డు డైకస్‌రోడ్డు సెంటర్ ఎన్‌సిసి కాలనీ 3వ వీధిలో కోతుల బెడద ఎక్కువైంది. దీంతో ఆ కాలనీ వాసులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. తెల్లవారుజామున ఎక్కడినుంచో కోతులు గుంపులుగా ఇళ్ళల్లోకి వచ్చి సామాన్లు, తినుబండారాలు ఎత్తుకుపోవడం, చెట్లను ధ్వంసం చేయడం లాంటివి చేస్తున్నాయి. ఈ కోతుల వల్ల చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ పైనపడి పిల్లల్ని గాయపరుస్తాయోనని ఆందోళన చెందుతున్నాం. మునిసిపల్ శాఖ అధికారులు కోతుల నుంచి రక్షణ కల్పించి, దూరప్రాంతాలకు వాటిని తరలించాలని కోరుతున్నాం.

**ఎన్‌సిసి కాలనీవాసులు, నెల్లూరు.**

### ఇలాంటి ప్రధాని మనకి ఉండడం

## మన దేశం చేసుకున్న అదృష్టం

ప్రస్తుతం మన దేశంలో అన్నివిధాలుగా నెలకొన్న పరిస్థితులు చూస్తుంటే, ఇలాంటి తరుణంలో నరేంద్ర మోడీ లాంటి ప్రధానమంత్రి మనకు ఉండడం మన దేశం చేసుకున్న అదృష్టమేమో అనిపిస్తుంది. ఒకవైపు కరోనా మహమ్మారి, మరోవైపు ఆర్థిక సంక్షోభం, ఇంకోవైపు చైనా బెదిరింపులు, ఇన్ని సమస్యలు తన ఎదురుగా వున్నా ఎక్కడా జంకకుండా దేశ ప్రజలకు మనోస్థైర్యాన్ని ఇస్తూ, వీలైనన్ని ఎక్కువసార్లు కెమెరా ముందుకొచ్చి జాతినుద్దేశించి ప్రసంగిస్తూ, మీకు నేనున్నాను అని భరోసా ఇస్తున్న తొలి భారత ప్రధానమంత్రి బహుశా మోడీగారేనేమో. మొన్నటికి మొన్న అకస్మాత్తుగా భారత్ చైనా సరిహద్దు లడాఖ్‌ను సందర్శించి అక్కడ అందరినీ ఆశ్చర్యపరచే విధంగా వారితో ముచ్చటించి, ధైర్యాన్ని నూరిపోసి, వారి శక్తిని సమర్థతను కీర్తించి వచ్చారు మోడీగారు. ఇలా ఎప్పటికప్పుడు సమస్యలకు అనుగుణంగా సమయస్ఫూర్తితో స్పందించే ప్రధాని దొరకడం మన దేశం చేసుకున్న పుణ్యమే. జై భారత్‌మాత...!

**కొలకనూరు చక్రవర్తిరెడ్డి, హైదరాబాదు.**

## మళ్ళీ లాక్‌డౌన్ పెడితే బాగుణ్ణేమో

గతవారం 'లాయర్'లో 'జంకులేని జనం' అని రాసిన వార్త బాగుంది. మీరు చెప్పినట్లుగా కోటిమందిలో తనకే లాటరీ వస్తుందని ఆశపడే మనిషి, కరోనా మాత్రం తనకు రాదులే అనే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. నగరంలో ఎక్కడ చూసినా టీ అంగళ్ల దగ్గర జనం గుంపులు గుంపులుగా చేరుతూనే వున్నారు. ముఖ్యంగా మా వేదాయపాలెం సెంటర్‌లో జనాలకి అడ్డు అదుపు లేకుండా వుంది, మందలు మందలుగా రోడ్లపైకి వస్తూనే వున్నారు. పదుల సంఖ్య నుండి వేల సంఖ్యలోకి కరోనా కేసులు పెరుగుతున్న సమయంలో మరోసారి కనీసం 3 వారాలు లాక్‌డౌన్ పెడితే బాగుంటుందేమో. ఇలా జనాలను ఇష్టారాజ్యంగా రోడ్లపైన వదిలేస్తే రానున్న రోజుల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారి భయంకరంగా తయారయ్యే ప్రమాదం వుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచనచేసి మళ్ళీ లాక్‌డౌన్ ప్రకటించడమే దీనికి సరైన మందు.

**ఎం.లక్ష్మీరాజ్యం, వేదాయపాలెం.**

## ఎందుకీ అర్థం లేని బారికేడ్లు

కంటైన్మెంట్ జోన్, రెడ్‌జోన్ అంటూ నెల్లూరు నగరంలో ఎక్కడపడితే అక్కడ బారికేడ్లు అడ్డదిడ్డంగా కట్టివేస్తున్నారు. అసలు వీటిని కట్టేవారికి, కట్టిస్తున్న వారికీ ముందుచూపు వుందా..? లేక కేవలం మనీ చూపే వుందా.?? అన్న అనుమానం కలుగుతోంది. ఎక్కడో ఒక్క వీధిలో పాజిటివ్ కేసు వచ్చిందని ఆ వీధి చుట్టూ వున్న మిగతా వీధులన్నీ మూసేస్తున్నారు. ఎక్కడ మూస్తే సరిగ్గా రెడ్‌జోన్ నిబంధనలు అమలవుతాయో కూడా అవగాహన లేనివారికి ఈ బాధ్యతలు అప్పచెప్పినట్లున్నారు. ముఖ్యంగా ఇటీవల మాగుంట లే అవుట్ లోని రోడ్లన్నీ తలాతోకా లేకుండా మూసేశారు, అధికారులను వివరణ అడగబోతే ఒకరిమీద ఒకరు చెప్పుకుంటున్నారు. నిబద్ధత గల అధికారికి ఇలాంటి ముఖ్యమైన బాధ్యతలు అప్పజెప్పి ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గారిని కోరుతున్నాను.

**జి. యం. యస్ రెడ్డి, మాగుంట లే అవుట్.**

### కాలువల్లో పూడిక తీయండి

ఈ కరోనా కాలంలో మున్సిపల్ అధికారులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాంటిది నగరంలోని చాలా వీధుల్లోని మురికి కాలువల్లో పూడిక తీయడం లేదు. దీంతో కాలువలు దోమలకు నిలయాలవుతున్నాయి. వచ్చేది వర్షాకాలం కనుక మున్సిపల్ అధికారులు వీటిపై శ్రద్ధ పెడితే బాగుంటుంది.

**ఎం.సుబ్బయ్య, నెల్లూరు.**

# 'దోమల పుట్టిల్లు'.. అనే
# చెడ్డపేరు పోగొట్టాలి

**నెల్లూరంటేనే దోమలకు పుట్టినిల్లుగా పేరుపడింది. ఎక్కడ చూసినా దోమలే. రాత్రీ పగలు తేడా లేకుండా జనాన్ని కుట్టికుట్టి చంపుతున్నాయి. రోజురోజుకు అవి పుట్టలు పుట్టలుగా పెరిగిపోతూనే ఉన్నాయి. చీకటి పడితే చాలు ఎక్కడనుంచి వస్తాయో తెలియదు.. కోట్లకొద్దీ దోమలు విరుచుకుపడుతుంటాయి. మురుగుదిబ్బగా మారిన నగరాన్ని పరిశుభ్రంగా మారిస్తే తప్ప ఈ దోమల బాధ పోదు. నెల్లూరు నగరపాలక సంస్థ వెంటనే మేల్కొని.. తక్షణం దోమల నివారణ పనిలో దిగాలి. నగరాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఇది దోమల పుట్టిల్లు అనే చెడ్డపేరు పోగొట్టాలి.**


ఫైల్ ఫోటో

నెల్లూరులో ఇప్పుడు దోమల నివారణే అత్యంత ముఖ్యం. పుట్టలుపుట్టలుగా పుట్టుకొస్తున్న ఈ దోమల నివారణకు నగరపాలక సంస్థ అధికారులు వెంటనే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే కరోనా వ్యాధితో బెంబేలెత్తుతున్న జనం.. ఈ దోమల వల్ల మరిన్ని రకాల వ్యాధులు వస్తాయేమోనని అదిరిపోతున్నారు. అందులోనూ ఇది డెంగీ, మలేరియాల కాలం కూడా. మూలిగే నక్క మీద తాటికాయపడ్డట్టుగా.. ఆ ప్రాణాంతక వ్యాధులు కూడా చుట్టుముడితే ఇక తమ పని అయిపోతుందని ప్రజలు భయపడి చస్తున్నారు.

**ఈ నగరానికి... ఏం కావాలి?..**

### ఎక్కడ చూసినా మురుగుదిబ్బలే...

దోమల నివారణకు నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. నగరంలో ఎక్కడ చూసినా అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. మురుగుదిబ్బలు, మురుగుకాలువలు ఎక్కువయ్యాయి. ఖాళీస్థలాలు మురుగు మడుగులుగా తయారయ్యాయి. దీంతో దోమలకు బాగా ఆవాసం దొరుకుతోంది. దుర్గంధపూరిత వాతావరణం నగరమంతా ఉండడంతో దోమలు హాయిగా వీరవిహారం చేస్తున్నాయి. నిత్యం మురుగుకాలువల పూడిక తీసి మురుగునీరు వెళ్ళిపోయేలా చర్యలు తీసుకోవడం, చెత్తకుప్పలను, మురుగుదిబ్బలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండడం, రోడ్లను పరిశుభ్రం చేస్తుండడం మొక్కుబడి తంతుగానే ఉంటోంది. నగరంలో సుమారు అయిదువేలకు పైగానే ఖాళీస్థలాలున్నట్లు అంచనా. వాటిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కానీ అనేక స్థలాలు దోమల ఉత్పత్తికేంద్రాలుగా, మురుగుమడుగులుగా తయారైనా పట్టించుకునేవారు లేరు.

### మూలన పడిన ఫాగింగ్ యంత్రాలు

నగరంలో సుమారు ఏడున్నర లక్షల మందిదాకా ప్రజలు నివసిస్తున్నారు. పరిపాలనా సౌలభ్యం కోసం నగరాన్ని 54 డివిజన్లుగా ఏర్పాటుచేశారు. దోమల బాధ నివారించేందుకు క్రమబద్ధంగా అన్ని ప్రాంతాల్లోనూ ఫాగింగ్ జరపాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎంతో విలువైన ఫాగింగ్ యంత్రాలను ఎప్పుడో మూలన పడేశారు. కొన్ని యంత్రాలు చెడిపోయి ఉన్నాయి కూడా. వాటిని బాగుచేయించే వారు లేరు. దోమల నివారణ అనేది మాటల్లో తప్ప.. ఆచరణలో అంతా శూన్యమే. ఇళ్ళలో దోమలమందు వెలిగించినా.. దానికి కూడా అవి అలవాటు పడిపోయాయి హాయిగా తిరుగుతూ.. అందరినీ కుట్టేస్తున్నాయి. దోమల మందు పొగకు మనకు ఊపిరాడదు తప్పితే.. వాటికి మాత్రం ఏమీ కావడం లేదు. దోమల నివారణకు, పరిశుభ్రతా చర్యలకు ఏడాదికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామంటున్నారే తప్ప..ఆచరణలో ఇవన్నీ ఆకాశకుసుమాలు గానే కనిపిస్తున్నాయి.

### పటిష్టమైన ప్రణాళిక ఏదీ?..

దాదాపు ఇప్పుడు అన్ని డివిజన్లలోనూ కరోనా ప్రభావంతో పారిశుద్ధ్యపు పనులు వేగవంతమైనప్పటికీ, ఎప్పటికప్పుడు మురుగు పేరుకుపోతూనే ఉంది. ముఖ్యంగా దోమల లార్వాను ఉత్పత్తిచేసే మురుగుకాలువల్లో నిత్యం పూడికతీయకపోవడం వల్ల ఆ కాలువల్లో దోమలగుడ్లు నిండిపోతున్నాయి. దోమలు పెరిగిపోతుండడంతో వ్యాధులు ప్రబలిపోతున్నాయి. నగరపాలక సంస్థకు పాలకవర్గం లేకపోవడమో.. ప్రత్యేకాధికారులు ఉన్నా ఇలాంటి సమస్యలపై దృష్టిపెట్టకపోతుండడమో కారణమేదైతేనేం.. దోమలు మాత్రం ఇదే సందని తమ పని తాము కానిచ్చేస్తున్నాయి. నగరంలో రోజూ ఎంత చెత్తను తీసేస్తున్నా.. అంతకు పదింతల చెత్త వస్తూనే ఉంటుంది. దీని నివారణకు సరైన ప్రణాళిక లేదు. మురుగు పోతే తప్ప దోమలు పోవు. ప్రజలు కూడా తమవంతు బాధ్యతగా పరిశుభ్రతకు చేయూతనందించాలి. అధికారులు ఇకనైనా శాశ్వత ప్రాతిపదికపై ఒక పటిష్టమైన ప్రణాళికను రూపొందించుకుని అమలుచేస్తే తప్ప ఈ మురుగుదిబ్బల గబ్బు పోదు. తద్వారా పెరిగే దోమల సమస్య ఒక కొలిక్కి రాదు. అధికారులు తక్షణం నగరమంతా పరిశుభ్రతా చర్యలు చేపట్టాలి. ఈ నగరానికి ఇప్పుడిదే కావాలి.




# నెల్లూరు పోలీస్..
# సేవల్లో శెభాష్!

## అరుదైన 'ఐఎస్ఓ-9001' గుర్తింపు

**ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ-9001 గుర్తింపు నెల్లూరుజిల్లా పోలీసుశాఖకు లభించడం ఎంతో సంతోషం.. అభినందనీయం కూడా. ఎందుకంటే, సాధారణంగా ఈ గుర్తింపు ఎంతో నిర్వహణ సామర్థ్యం, నాణ్యతతో కూడిన ఉత్పత్తులందించే సంస్థలకు మాత్రమే లభిస్తుంది కానీ, ప్రభుత్వ కార్యాలయాలకు ఇలాంటి గుర్తింపు లభించడం బాగా అరుదు. తాజాగా, దక్షిణ భారతదేశంలోనే ఇలాంటి అపురూపమైన ఖ్యాతిని మన జిల్లా పోలీసు యంత్రాంగం దక్కించుకోవడం నెల్లూరుసీమకే గర్వకారణం.**

కేంద్రప్రభుత్వ సంస్థ 'బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్' నుంచి ఐఎస్ఓ సర్టిఫికెట్టు లభించడమంటే అంత సామాన్యమైన విషయమేమీ కాదు. ఎన్నో అంశాల్లో ఉత్తమమైన రీతులను అవలంభించడం ద్వారానే ఈ గుర్తింపు లభిస్తుంది. అలాంటి అత్యుత్తమమైన గుర్తింపు మనకు లభించడం ఒకరకంగా మన జిల్లా అదృష్టమే. రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 'దిశ' పోలీస్ స్టేషన్లకు వేర్వేరుగా ఈ గుర్తింపు లభించింది. అయితే, జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, సబ్‌డివిజన్ కార్యాలయాలు, ఎస్పీ కార్యాలయం అన్నీ కలసి జిల్లా పోలీస్ యూనిట్‌కు ఈ గుర్తింపు లభించడం ఇదే తొలిసారి కావడం విశేషం. జిల్లా పోలీసు శాఖ అందిస్తున్న అత్యుత్తమ సేవలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న తీరు, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకుని జిల్లా పోలీసు శాఖకు ఈ విశిష్ట ఖ్యాతి లభించింది. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదును పరిశీలించి సకాలంలో పరిష్కరించడం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కీలకమైన కేసులను ఛేదించడం, డిజిటలైజేషన్ ప్రక్రియతోనే అన్ని రకాల కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా ఈ అరుదైన ఖ్యాతి లభించింది.

### సేవల్లో ఫస్ట్.. పారదర్శకతలో బెస్ట్

జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో పరిశుభ్రత, పచ్చదనానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం, ఫైల్ సేఫ్టీ నిబంధనలు పక్కాగా అమలుచేయడం, ప్రతి స్టేషన్‌కు బోర్డులు ఏర్పాటుచేయడం, ప్రధాన గేట్లు నిర్మించడం, పూర్తిస్థాయిలో ఫర్నిచర్ ఏర్పాటు, పెండింగ్ కేసులను, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు నోటీస్‌బోర్డు ద్వారా అందరికీ తెలిసేలా పారదర్శకంగా ఏర్పాటుచేయడం, పోలీస్‌స్టేషన్లలో మంచినీటి వసతికోసం వాటర్‌కూలర్లు, మరుగుదొడ్లు ఇతర వసతులు కల్పించడం, రికార్డులు సక్రమంగా నిర్వహించడం వంటి దాదాపు 30 రకాల అంశాల్లో జిల్లా పోలీసుశాఖ తీరు అనుసరిస్తున్న విధానాలు ఉత్తమంగా ఉండడంతో మన పోలీసుశాఖకు ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది.

### ఎస్పీ చర్యలతో.. మెరుగైన పనితీరు :

గత రెండేళ్ళుగా జిల్లా పోలీస్ యంత్రాంగం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వైపు దృష్టి సారించింది. జిల్లా ఎస్పీగా భాస్కర్ భూషణ్ ఎనిమిది నెలల క్రితం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి శాఖాపరంగా అన్ని విభాగాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పోలీసు సిబ్బంది పనితీరు ఎంతో మెరుగైన రీతిలో ఉండేలా సత్వర చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 64 పోలీస్‌స్టేషన్లు, 5 సబ్‌డివిజన్ కార్యాలయాల్లోనూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. అందుకు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు. ప్రత్యేకించి ఈ-ఆఫీస్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. నెలకు సగటున 30వేలకు పైగానే ఫైల్స్ ఈ-ఆఫీస్ ద్వారానే పరిష్కరిస్తుండడం విశేషం. పాతకేసులకు సంబంధించి ఏ రికార్డు కావాలన్నా వెంటనే అందుబాటులోకి వచ్చేలా డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ విధానం వల్ల సేవల్లో పారదర్శకతతో పాటు అన్ని రకాల సేవలు సకాలంలో అందుబాటులోకి వచ్చేలా పర్యవేక్షిస్తున్నారు.

ఏదేమైనా జిల్లా ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తూ, జిల్లా పోలీసుశాఖకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతిష్టాత్మకమైన అవార్డును సాధించిపెట్టి త్వరలోనే ఈ అవార్డు అందుకోబోతోన్న జిల్లా ఎస్పీ భాస్కరభూషణ్‌కు, ఈ కరోనా కష్టకాలంలో అకుంఠిత దీక్షతో ప్రజలకు అత్యుత్తమ సేవలందిస్తున్న పోలీసు సిబ్బందికీ ఈ సందర్భంగా 'లాయర్' శుభాకాంక్షలు.

# బూజుపట్టిన జీడిపప్పు.. కుళ్లిపోయిన కర్జూరం

- నగరంలో పురుగులు పట్టిన పలసరుకులు
- దుకాణాలను సీజ్ చేసిన ఆరోగ్యాధికారి వెంకటరమణ

ఎన్నిసార్లు అధికారులు హెచ్చరిస్తున్నా నెల్లూరులోని పలువురు వ్యాపారులు తమ తీరు మార్చుకోవడం లేదు. సరుకులు పురుగులు పడుతున్నా, బూజుపట్టిపోయినా, కుళ్ళిపోయినా సరే ఏదో ఒకరకంగా వాటిని అమ్మేసి సొమ్ము చేసుకునేందుకే ప్రయత్నిస్తున్నారు.

ఈనెల 4న స్టోన్‌హౌస్‌పేట సమీపంలోని రేబాలవారి వీధిలో పలు దుకాణాలను మునిసిపల్ శాఖ అధికారి వెంకటరమణ పరిశీలిస్తుండగా, ఒక దుకాణంలో బస్తాలకొద్దీ డ్రైఫ్రూట్స్, కర్జూరం, జీడిపప్పు పురుగులు పట్టి వుండడాన్ని గమనించారు. వెంటనే ఆ దుకాణాన్ని సీజ్ చేశారు. చెడిపోయిన ఆ సరుకునంతా నిర్వీర్యం చేసి ఆటోలో డంపింగ్‌యార్డ్‌కు తరలించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కఠిన చర్యలు తీసుకుంటామని




ఆయన ఈ సందర్భంగా దుకాణదారులను గట్టిగా హెచ్చరించారు. మరో దుకాణంలో తనిఖీ చేసి అక్కడున్న సరుకుల ప్యాకెట్లపై తేదీలు లేకుండా విక్రయానికి సిద్ధంగా ఉంచడాన్ని చూసి ఆ సరుకునంతా స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత స్టోన్‌హౌస్‌పేటలోని ప్లాస్టిక్ దుకాణాలను పరిశీలించారు. 50 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను, ప్లాస్టిక్ ప్లేట్లను స్వాధీనం చేసుకుని, వాటిని విక్రయిస్తున్న ఆ దుకాణాలను సీజ్ చేశారు. మినీబైపాస్‌రోడ్డులోని పలు వస్త్ర దుకాణాలు, షోరూమ్‌లలో కరోనా నియంత్రణ జాగ్రత్తలు పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శానిటరీ సూపర్ వైజర్లు ప్రతాప్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

### మార్కెట్లు, మాల్స్‌లో..

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

### కరోనా నివారణ జాగ్రత్తలపై పరిశీలనలు



నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న షాపింగ్‌మాల్స్, సూపర్‌మార్కెట్లలో కరోనా నియంత్రణకు తగు చర్యలు తీసుకుంటున్నారా లేదా అని జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఈనెల6న ఆకస్మిక తనిఖీలు చేశారు. తొలుత మాగుంట లేఅవుట్‌లోని మోర్ సూపర్ మార్కెట్‌ను సందర్శించి అక్కడ వినియోగదారులు, మాల్స్ సిబ్బంది కోవిడ్-19 నియంత్రణా చర్యలు పాటిస్తున్నారా లేదా పరిశీలించారు. నిత్యావసర వస్తువులుండే ర్యాక్‌ల మధ్య దూరం ఎక్కువగా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అందరూ మాస్కులు ధరించి, భౌతికదూరం పాటించాలని చెప్పారు. ఆ తర్వాత రిలయన్స్ ట్రెండ్, ఎంజిబి మాల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కరోనా పాజిటివ్‌కేసులు రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా షాపింగ్ మాల్స్, సూపర్‌మార్కెట్ల యాజమాన్యాలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ కరోనా మహమ్మారి వ్యాధి నియంత్రణకు సహకరించాలన్నారు. షాపుల్లోని సిబ్బంది మాస్కులు ధరించడంతో పాటు శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవాలని, వినియోగదారులెవరైనా మాస్కులు లేకుండా వస్తే వారిని లోపలికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. థర్మల్ స్కానర్‌తో పరీక్షించిన తర్వాతనే లోపలకి అనుమతించాలన్నారు. ఈ తనిఖీల్లో కలెక్టర్‌తో పాటు పాల్గొన్న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషన్ మాట్లాడుతూ మాల్స్ వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠినచర్యలు తప్పవన్నారు. కార్పొరేషన్ కమిషనర్ బాపిరెడ్డి, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.

### ఆడిట్‌ను

## పక్కాగా నిర్వహించండి

నెల్లూరు జిల్లాలోని మండల, జిల్లా సమాఖ్య ఆడిట్‌ను పక్కాగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ శీనానాయక్ పేర్కొన్నారు. ఈనెల 6న డీఆర్‌డీఏ కార్యాలయంలో ఆడిటర్లతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 46 మండల సమాఖ్యలు, 1460 గ్రామ సమాఖ్యల ఆడిట్‌ను నిర్వహించాలన్నారు. డీపీఎం ఫైనాన్స్ రవికుమార్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్

## నూతన కార్యవర్గం

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈనెల 5న ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షులుగా రామానుజం, కార్యదర్శిగా కృష్ణకుమార్, కోశాధికారిగా సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా కొంతమంది ఎన్నికయ్యారు. క్లబ్ మాజీ మల్టిపుల్ కమిటీ కౌన్సిల్ ఛైర్మన్ వేమా కోటేశ్వరరావు, మాజీ గవర్నర్లు కిషోర్ కుమార్, అమృతవల్లి, సురేష్, రమణయ్య, బయ్యా రవి కుమార్, క్లబ్ విద్యాకమిటీ ఛైర్మన్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

### ఐఎంఏ వైద్యుల సేవలు

## వినియోగించుకోండి

కరోనా నియంత్రణకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యుల సేవలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 5న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఐఎంఏ, జీజీహెచ్, ఉపాధి కల్పనాధికారులతో సమీక్షించారు. వైద్య సేవల్లో ఎలాంటి సమస్యలు వచ్చినా అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ ప్రభాకర రెడ్డి, డీసీవో తిరుపాల్‌రెడ్డి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, ఐఎంఏ నాయకులు డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

### పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా

## డాక్టర్ సుధాకర్‌రెడ్డి

జిల్లాకేంద్రమైన నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ప్రముఖ పెథాలజిస్ట్, ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఇ.సుధాకర్‌రెడ్డి ఈనెల 4న బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటిదాకా పనిచేస్తున్న డాక్టర్ శ్రీహరి స్థానంలో డాక్టర్ సుధాకర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ నియమించారు.

# నెల్లూరు కబుర్లు

## భౌతికదూరం తప్పనిసరి

### మునిసిపల్ కమిషనర్

కూరగాయలు, పండ్ల మార్కెట్లలో వ్యక్తుల మధ్య భౌతిక దూరం తప్పనిసరిగా పాటించాలని నెల్లూరు నగర కమిషనర్ బాపిరెడ్డి హెచ్చరించారు. ఈనెల 7న ఆయన ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌తో కలిసి నెల్లూరులోని ఎస్వీజీఎస్ మైదానంలో ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్‌ను, నవాబుపేటలోని పండ్ల మార్కెట్‌ను తనిఖీ చేశారు. ప్రస్తుత విపత్కర పరిస్థితులు ఎదుర్కోవాలంటే మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించడం తప్పనిసరన్నారు. ఎఎంసీ ఛైర్మన్ ఏసునాయుడు, ఏడీ రామమ్మ పాల్గొన్నారు.

### ఆరోగ్యశాఖలో

## జోరుగా దరఖాస్తులు

నెల్లూరు జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా వున్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తున్న ఈ పోస్టులకు అభ్యర్థులు జోరుగా దరఖాస్తులు అందజేస్తున్నారు. ఈనెల 6న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు తదితర పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు పోటీపడ్డారు.

### ప్రత్యేక డీఎస్సీలకు

## నియామక పత్రాలు

ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు 2019 ప్రత్యేక డీఎస్సీలో అర్హత సాధించిన వారికి ఈనెల 6న జేసీ ప్రభాకర రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. డీఈవో జనార్ధనాచార్యులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు బోధన చేసేందుకు 35 మంది అర్హత సాధించగా 33 మంది ఇటీవల కౌన్సిలింగ్‌కు వచ్చారని, వీరికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు.

### ఆర్టీసీ బస్టాండ్‌ను

## లాక్‌డౌన్ చేయండి

ఆర్టీసీ కార్మికులు ఇద్దరు కరోనాతో మృతి చెందారన్న అనుమానం కార్మికుల్లో ఉందని, ఆర్టీసీ బస్టాండ్‌ను లాక్‌డౌన్ చేసి కార్మికులందరికీ కోవిడ్ పరీక్షలు చేయాలని ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ఈనెల 6న నెల్లూరు ప్రధాన బస్టాండ్ ఆర్‌ఎం కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం పివి శేషయ్య మాట్లాడుతూ ఎవరూ ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని, ప్రయాణీకులతో బాటు ఉద్యోగులకు, సిబ్బందికి శానిటైజర్లు ఏర్పాటు చేశామన్నారు.

## ముగ్గురు సిఐల బదిలీ

జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు సిఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి ప్రభాకర్‌రావు ఈనెల 7న ఉత్తర్వులు జారీచేశారు. వెంకటగిరి సిఐగా పనిచేస్తున్న అన్వర్‌బాషాను సంతపేట పోలీస్ స్టేషన్‌కు, బాలాజీనగర్ సిఐ సోమయ్యను ఆత్మకూరు సర్కిల్‌కు, అక్కడ పనిచేస్తున్న పాపారావును వీఆర్‌కు బదిలీ చేశారు.

### పొదుపు గ్రూపులకు

## రుణమాఫీ

నెల్లూరు జిల్లాలో వైఎస్సార్ ఆసరా పథకంలో స్వయం సహాయక సంఘాలకు(ఎస్‌హెచ్‌జీ) రూ.921.35 కోట్ల మేరకు రుణ మాఫీ కానున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శీనానాయక్ తెలిపారు. నెల్లూరు డీఆర్‌డీఏ కార్యాలయంలో ఈనెల 6న ఆయన మాట్లాడుతూ ఈ నిధులు నాలుగు విడతలుగా మంజూరు కానున్నాయని 29132 సంఘాలు లబ్ధి పొందనున్నట్లు తెలిపారు.

### ఆర్టీసీ రిజర్వేషన్

## కౌంటర్ మార్పు

నెల్లూరులోని ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో వున్న రిజర్వేషన్ కౌంటర్‌ను విచారణ కేంద్రం పక్కనున్న గదిలోకి మార్చినట్లు ఆర్టీసీ ఆర్ ఎం పివి శేషయ్య తెలిపారు. రిజర్వేషన్ కౌంటర్‌లో పనిచేస్తున్న వ్యక్తి కరోనాతో చనిపోయాడన్న అనుమానంతో అక్కడి వారికి పరీక్షలు చేయించామని, ఫలితాలు రావాల్సి ఉందన్నారు.

### ఆస్తి పన్ను రాయితీ

## గడువు పెంచారు

నెల్లూరు నగరంలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఈ నెలాఖరు వరకు రాయితీని పొడిగిస్తున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ ఉత్తర్వులిచ్చింది. రాయితీ గడువు జూన్ నెల 30 వ తేదీకి ముగిసినా మరో నెల రోజులు పొడిగించినట్లు కార్పొరేషన్ అధికారులు పేర్కొన్నారు. 2021 మార్చి నెల వరకు చెల్లించాల్సిన పన్నులను ఈ నెలాఖరులోగా చెల్లిస్తే మొత్తంలో 5% రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

### హోంగార్డులకు

## చెక్కులు పంపిణీ చేసిన ఎస్పీ



నెల్లూరు హోంగార్డ్ యూనిట్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులకు జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ చేతుల మీదుగా ఈనెల 3న చెక్కులు పంపిణీ చేశారు. వీరికి ఆర్థిక చేయూతనందించేందుకు జిల్లాలోని హోంగార్డులు తమ ఒకరోజు వేతనాన్ని అందించగా టి.సుబ్బనరసయ్యకు 4,19,610 రూపాయలు, ఎన్.బాలాజీ లక్ష్మీకుమార్‌కు 4.24,580 రూపాయలు చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ ఎన్‌వి రమణయ్య, జిల్లా పోలీస్ కార్యాలయం పరిపాలనాధికారి ఎం.విజయకుమార్, సూపరింటెండెంట్ ఎన్. రామనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బయోమెట్రిక్ విధానం

## రద్దు చేయండి

కరోనా వైరస్ వ్యాప్తి ఆగే వరకు చౌకదుకాణాల్లో బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని చౌకధరల దుకాణాదారుల సంఘాల సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈనెల 6న నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునగా గిరిజారావు విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్‌లో అమలు చేసిన విధంగా వీఆర్వో, గ్రామ సచివాలయ కార్యదర్శి బయోమెట్రిక్‌తో సరకులు పంపిణీ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

### దివ్యాంగులకు

## ఆహారవస్తువులు పంపిణీ

నెల్లూరు వేదాయపాలెంలో ఉన్న స్వర్ణదీపం దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్‌లోని సుమారు 50 మంది దివ్యాంగులకు ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ 21వ డివిజన్ నాయకులు పాలకుర్తి శ్రీనివాసులు, ఆనంగి రమణయ్య సేమియా ప్యాకెట్లను, గోధుమ పిండిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాముల రమణయ్య, పాడిచెర్ల భైరప్ప, అంకయ్య, కట్టా మల్లికార్జున, చిన వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడు.. అల్లూరి సీతారామరాజు

### - ఘనంగా జయంతి వేడుకలు



మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఈనెల 4న నెల్లూరులో ఘనంగా నిర్వహించి అల్లూరికి ఘన నివాళులర్పించారు. నగరంలోని జిల్లా ఎమర్జన్సీ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో అల్లూరి సీతారామ రాజు పాత్ర మరువలేనిదని, ఆంగ్లేయులను గడగడలాడించిన మహోజ్వల శక్తి అనీ, భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అల్లూరి చెరగని ముద్ర వేసుకున్నారని కలెక్టర్ కొనియాడారు. అల్లూరి దేశభక్తిని, ధైర్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా నగరంలోని పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ భావన తదితర అధికారులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకటరత్నం, మనోహర్‌రావు, వీరభద్రుడు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

# రైతు పక్షపాతి.. మహానేత వైయస్ఆర్



*రైతు బాగుంటే.. దేశం బాగుంటుందంటూ, వారి శ్రేయస్సుకు అహర్నిశలు కృషి చేసి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన దివంగత మహానేత మాజీముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి 71వ జయంతిని ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.*









## అభివృద్ధి ప్రదాత వైయస్ఆర్ - మంత్రి అనిల్

మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజాహృదయ నేత అని, ప్రజల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి కోట్లాదిమంది ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈనెల8న వైయస్సార్ జయంతి సందర్భంగా నెల్లూరులోని కరెంటాఫీస్ సెంటర్‌లో వైయస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ వైయస్సార్ భౌతికంగా దూరమై పదేళ్ళు గడుస్తున్నా ఆ మహానేత ప్రజలందరి మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఇప్పుడు రాజన్న పాలన జగనన్న ద్వారా వచ్చిందని ప్రజలంతా సంతోషిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్సార్ రాష్ట్రంలోని పేదప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లారని ఆయన గుర్తుచేశారు. వైయస్సార్ హయాంలో వర్షాలు పుష్కలంగా కురుస్తూ రైతులంతా సంతోషంగా ఉండేవారని, ఇప్పుడు ఆ సంతోషం జగనన్న పాలనలో చూస్తున్నామని అన్నారు. ప్రజల ఆరోగ్య సౌకర్యాల కోసం ముఖ్యమంత్రి జగనన్న ఇటీవల 108, 104 వాహనాలను రాష్ట్రమంతటా ఒకేసారి ప్రవేశపెట్టి ప్రారంభించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు ఎన్‌డిసిసిబి ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముక్కాల ద్వారకానాథ్, కొణిదెల సుధీర్, దార్ల వెంకటేశ్వర్లు, వేలూరు మహేష్, సయ్యద్ సమీ, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుజాతి మరచిపోదు - రాజ్యసభ సభ్యులు విపిఆర్

తెలుగుజాతి మరచిపోలేని మహానాయకుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తెలిపారు. నెల్లూరులోని కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిటిడీ బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు.

## చిరస్థాయిగా వైయస్ పథకాలు - ఎమ్మెల్యే కోటంరెడ్డి

దివంగత వైయస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఇప్పటి వరకు చూడలేదని, ఆయన చేసిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చిరస్థాయిగా గుర్తుండిపోతాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈనెల 8న 28వ డివిజన్ కరెంటాఫీసు సెంటర్లోని వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైస్సార్ సీపీ నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరావు, నాయకులు మురారి, బొబ్బల శ్రీనివాస యాదవ్, మిద్దె మురళీకృష్ణయాదవ్, ఎం.సుధీర్‌కుమార్‌రెడ్డి, హరిబాబుయాదవ్, కోడూరు కమలాకర్‌రెడ్డి, ఏసునాయుడు, హజరత్ నాయుడు, మేఘనాథ్ సింగ్, మొయిళ్ళ గౌరి, తోట శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికే పెద్దపీట - ఎమ్మెల్యే ప్రసన్న

రైతుల సంక్షేమానికి దివంగత సీఎం వైయస్ రాజశేఖర్‌రెడ్డి పెద్దపీట వేశారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కొనియాడారు. ఈనెల 8న కోవూరు బైపాస్ రోడ్డులోని వైయస్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీసీఎంయస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పరిపాలనలో తనదైన ముద్ర - ఎమ్మెల్యే కాకాణి

దివంగత నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి 2004లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేశాక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తన తొలి సంతకాన్ని వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు ఫైలుపై చేశారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈనెల 8న వైయస్ఆర్ జయంతిని పురస్కరించుకుని మనుబోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద డాక్టర్ వైయస్ఆర్ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన రూ.1200 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేసిన ఘనత వైయస్సార్‌దేనన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆనం నివాసంలో..

వైయస్ జయంతి సందర్భంగా నెల్లూరు సంతపేటలోని తన నివాసంలో వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# అమ్మ స్మృత్యంకంగా ఆహార వితరణ





'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి గారి సతీమణి, తమ తల్లి శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా జూలై 8వ తేదీన వారి కుమారులు తుంగా శివప్రశాంత్‌రెడ్డి, తుంగా శివప్రభాత్‌రెడ్డి పలు అనాథశరణాలయాలు, ఆశ్రమాలలో ఆహార వితరణ చేశారు.

శ్రీమతి తుంగా శ్రీదేవమ్మ గారి ప్రథమ వర్ధంతి(తిథుల ప్రకారం)ని పురస్కరించుకుని నగరంలోని పలు అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాల్లో ఈ కార్యక్రమం జరిగింది. ప్రగతి చారిటీస్, సత్యసాయి ట్రస్ట్, గీతామయి, మాత అన్నపూర్ణ, విశాలాక్షి వృద్ధాశ్రమాల్లో ఈ ఆహార వితరణ జరిగింది.

కరోనా కష్టకాలంలో ఈ ఆశ్రమాలకు బాసటగా తుంగా శ్రీదేవమ్మ గారి స్మృత్యంకంగా అన్ని చోట్ల కలిపి సుమారు 800 మందికి ఆహారాన్ని అందించారు.

### మల్లాం సుబ్రహ్మణ్యస్వామి

## ఆలయ ఛైర్మెన్‌గా చిల్లకూరు

ఆంధ్ర, తమిళ భక్తుల ఆరాధ్యదైవమైన చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసివున్న శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఛైర్మెన్‌గా మల్లాం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపి నాయకుడు చిల్లకూరు కోదండరామిరెడ్డిని నియమిస్తూ దేవాదాయశాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. ఆలయ కమిటీ ఛైర్మన్ గా చిల్లకూరు కోదండరామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఈనెల 5న ప్రమాణ స్వీకారం చేశారు.

వైయస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భానుప్రకాష్ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎంతోకాలంగా ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషిచేస్తున్న కోదండరామిరెడ్డిని ఆలయ ఛైర్మెన్‌గా నియమించడం పట్ల అటు పార్టీలోనూ ఇటు ప్రజల్లోనూ సంతోషం వ్యక్తమవుతోంది.

తనను ఆలయ ఛైర్మెన్‌గా నియమించడం పట్ల కోదండరామిరెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి, వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

### శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ

## సేవలు అమూల్యం

**- బిజెపి నేత భరత్‌కుమార్**

బిజెపి వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ దేశానికి చేసిన సేవలు అమూల్యమని బిజెపి జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్ అన్నారు. ఈనెల 6న నెల్లూరులోని బిజెపి కార్యాలయంలో శ్యామ్‌ప్రసాద్‌ముఖర్జీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి భరత్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్‌ముఖర్జీ దేశభక్తి, జాతీయభావం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. బిజెపి అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు పి.సురేంద్ర రెడ్డి, రాధాకృష్ణ, కొట్టే వెంకటేశ్వర్లు, కెసి రఘు నాథరాజు, కాయల మధు, ఏ.మురళి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## లయన్స్ క్లబ్..కొత్త కార్యవర్గం




గూడూరు లయన్స్ క్లబ్‌కు కొత్త కార్యవర్గం ఏర్పాటైంది. ఈనెల 5వ తేదీ పట్టణంలోని ద్వారకామాయి ఫంక్షన్‌హాల్‌లో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. నెల్లూరు శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత, లయన్ జిల్లా వైస్ గవర్నర్ బయ్యా వెంకటరవికుమార్ లయన్స్ నూతన కార్యవర్గసభ్యులచే ప్రమాణస్వీకారం చేయించారు. రూపేష్‌రెడ్డి అధ్యక్షునిగా, అందే కల్యాణస్వామి కార్యదర్శిగా, జగదీష్‌చంద్ర కోశాధికారిగా, అక్కన రమణయ్య వైస్ ప్రెసిడెంట్‌గా, ఎం.మురళిరెడ్డి మెంబర్‌షిప్ ఛైర్మెన్‌గా, షేక్ మస్తాన్ పిఆర్‌ఓగా ప్రమాణస్వీకారం చేశారు. డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, యుగంధర్ గౌరవ అతిథిగా, సుప్రియ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. వీరితోపాటు రియాజ్ అహ్మద్, డాక్టర్ చంద్రహాస్ పాల్గొని లయన్స్ సేవాకార్యక్రమాల గురించి ప్రసంగించారు.

## సరస్వతి శిశుమందిరం ప్రహరీగోడకు శంకుస్థాపన



గూడూరులోని సరస్వతి శిశుమందిరం ప్రహరీగోడకు ఈనెల 5న డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నిర్మాణానికయ్యే ఖర్చును సమకూరుస్తామని తెలిపారు. ప్రస్తుతానికి లక్షరూపాయలు ఇవ్వడం జరిగిందని, ఇంకా దాతలు వాకాటి రామ్మోహన్‌రావు పాతికవేలు, శేగు వెంకటలక్ష్మీ ప్రసాదరావు మరో పాతికవేల రూపాయలు, సనాతన భారత ఫౌండేషన్ వారు పాతికవేలు, దువ్వూరు యుగంధర్ పాతికవేలు ఇవ్వడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మల్లెమాల మురళీరెడ్డి, రావుల వెంకటేశ్వరరావు, పయ్యావుల మురళీనాయుడు, వాకాటి రామ్మోహన్‌రావు, వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వంగా ప్రసాదరెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు పలసరుకులు పంపిణీ



గూడూరు పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి దేవస్థానంలో ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్ క్లబ్ సహకారంతో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ సాయిదీప్తి దాతృత్వంతో దివ్యాంగులకు పలసరుకులు పంపిణీ చేశారు. ఆంధ్రమహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి చేతులమీదుగా ఈనెల 5న ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సమాజంలో సేవాదృక్పధంతో మెలగాలని సూచించారు. ఆంధ్రమహిళామండలి, ఇన్నర్‌వీల్ క్లబ్, రెడ్ సంస్థల ప్రతినిధులు కమలసాయి, జీవనిరెడ్డి, విష్ణువందన, పద్మ, సుధీర్, రాజేష్, శ్రీనివాసాచారి, వెంకటేశ్వర్లు, జమీర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## సాయినాథునికి పల్లకిసేవ



గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 5న గూడూరు ఇందిరమ్మ కాలనీలోని సాయిబాబా దేవాలయంలో ఎన్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. ఉడతా వెంకటయ్య కుటుంబసభ్యులు ఉడతా శ్రీనివాసులు, సుభాషిణి, రమేష్, శ్రీరంజని, చేవూరు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### ప్రైవేట్ క్లినిక్‌లపై...

# సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

కోవిడ్ నిబంధనలకు వ్యతిరేకంగా గూడూరు పట్టణంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు (ఆర్‌ఎంపీలు) నడుపుతున్న క్లినిక్‌లను సబ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఇటీవల పరిశీలించి వాటిని సీజ్ చేశారు. ఆసుపత్రి రోడ్‌లోని మూడు క్లినిక్‌లను పరిశీలించిన సబ్ కలెక్టర్ కోవిడ్19 సమయంలో కనీస జాగ్రత్తలైన థర్మల్ టెస్టింగ్, పిపిఇ కిట్‌లు లేకుండా, సామాజిక దూరం పాటించకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఇంజెక్షన్లు వేస్తూ బోర్డు బయట డాక్టర్ అని రాసుకుని ఉన్న మూడు క్లినిక్‌లను వెంటనే సీజ్ చేయాల్సిందిగా వైద్యాధికారులను ఆదేశించారు. అదేవిధంగా కోర్టు సెంటర్‌లో ఒకటి, గాంధీనగర్‌లో రెండు క్లినిక్‌లను కూడా సీజ్ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి వ్యవహరించాలన్నారు. అందుకు విరుద్ధంగా నిబంధనలకు భిన్నంగా వ్యవహరిస్తూ నడుపుతున్న క్లినిక్‌లను సీజ్ చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఓ అచ్యుతకుమారి, గూడూరు ఎంఆర్‌ఓ లీలారాణి, గూడూరు టౌన్ సిఐ దశరధరామారావు, వైద్య, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**కోవిడ్ నిబంధనల పాటించని 6 క్లినిక్‌లు సీజ్**



## కరోనాతో జాగ్రత్తగా ఉండాలి

**- మయూరి శ్యాంయాదవ్**




అరవై ఏళ్ళు దాటిన వృద్ధులు కరోనా మహమ్మారి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీకృష్ణసేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్ అన్నారు. ఈ నెల 6న గూడూరులోని గమళ్ళపాళెంలో ఉన్న ఓం సాయిరాం చారిటబుల్ ట్రస్ట్‌లోని 40 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధులు బయటకువెళ్లకుండా కరోనా పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ఒకవేళ బయటకు వెళ్ళినా తప్పనిసరిగా మాస్కు ధరించాలని, చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలని చెప్పారు. పునుగు ఆనంద్, ట్రస్ట్ నిర్వాహకురాలు కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



దివంగత మహానేత డా. వైయస్ రాజశేఖరరెడ్డి 71వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గూడూరు బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది, వైసిపి నేత యరగుడిపాటి చలపతిరావు, ఎన్.వెంగళరెడ్డి తదితరులు

## వృద్ధాశ్రమానికి వితరణ




ఆలిండియా ఇన్సురెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 70వ వ్యవస్థాపక దినం, వారోత్సవాల సందర్భంగా గూడూరులోని ఓంసాయిరాం చారిటీస్ వృద్ధులు వికలాంగుల ఆశ్రమానికి రెండు డైనింగ్ టేబుల్స్, 50 కేజీల బియ్యం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ఐసిఇయు గూడూరు యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ యజ్దాన్, ఎన్.శివకుమార్, సంయుక్త కార్యదర్శి డిబి శ్రీనివాసరావు, క్లాస్ వన్ ఆఫీసర్స్ కార్యదర్శి సిహెచ్ రాజశేఖర్‌రెడ్డి, సిఐటియు నాయకులు కేశవులతో పాటు వి.రామ్మోహన్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## 'చేయూత'కు విఆర్‌ఓ సంతకం అక్కర్లేదు

చేయూత పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు విఆర్‌ఓ సంతకం అవసరం లేదని, నేరుగా మీ-సేవ కేంద్రం, సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని సబ్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలియజేశారు. ఈనెల 6న గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరోనా వ్యాప్తి నేపథ్యంలో మహిళలు గుంపులుగా కార్యాలయాల వద్ద ఉండవద్దని సూచించారు. సామాజిక దూరం పాటిస్తూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముస్లింలకు కులధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు.

### ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో..

## కూరగాయల పంపిణీ



ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న గూడూరు మాలవ్యనగర్‌లోని రెడ్‌జోన్ ప్రాంతంలో నిరుపేదలైన 25 కుటుంబాల వారికి వారానికి సరిపడా కూరగాయలు పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ యమహా సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యులు బాలయ్యనాయుడు, గ్రానైట్ ప్రభాకర్, రవికుమార్, ప్రజేంద్రరెడ్డి, రామ్మోహన్‌రావు, మేకల మస్తానయ్య, కరిముల్లా, తిరుమలరావు, వాచ్‌షాప్ రాము, సివిఆర్ న్యూస్ కోఆర్డినేటర్ సతీష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

# నాన్న ఆశయాలను నెరవేరుస్తాం!

**- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



తన తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా విద్యానగర్‌లోని విద్యాసంస్థలను ఉన్నతస్థాయికి తీసుకెళ్ళి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తామని ఎన్‌బికెఆర్ ఐఎస్టీ కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 6న కోట మండలంలోని విద్యానగర్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్‌బీకెఆర్ విద్యాసంస్థలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని, ఇప్పటికే వున్న ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలతో పాటు కొత్త కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేస్తామన్నారు. నవోదయ విద్యాలయం ఏర్పాటుకు ఎంపి బల్లి దుర్గాప్రసాదరావుతో కలిసి కృషిచేస్తున్నామన్నారు.

### వాకాడు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా...

వాకాడును అన్నివిధాలా అభివృద్ధి చేయాలని, తద్వారా వాకాడును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని, అందుకు ప్రజలంతా సహకరించాలని వైకాపా నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఇటీవల ఆయన వాకాడులోని తన నివాసంలో పంచాయతి అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థలాల్లో ఎక్కడ ఆక్రమణలున్నా తొలగించాలని, ఆక్రమణ తొలగింపుల్లో దుకాణాలు కోల్పోయినవారికి పంచాయతి ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి ఇవ్వాలని అధికారులకు సూచించారు.

## 20లోగా గురుకులాలకు దరఖాస్తులు

గురుకుల విద్యాలయాల్లో వచ్చే ఏడాది 5వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని గురుకుల విద్యాలయాల జిల్లా కన్వీనర్ ఏ.సాంబశివరావు పేర్కొన్నారు. జిల్లాలోని గండిపాళెం, తుమ్మలపెంట, వెంకటగిరి, చిలమాన్‌చేను, నెల్లూరు, ఆత్మకూరు గురుకులాల్లో లాటరీ ద్వారా ప్రవేశాలు జరపనున్నామని, 2018-19, 2019-20 సంవత్సరాల్లో ప్రభుత్వం లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదివినవారు ఈ ప్రవేశాలకు అర్హులని వివరించారు.

## అయ్యోర్లు బడులకు రావాలి...

పాఠశాలలకు ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరు కావాలని డీఈఓ జనార్ధనాచార్యులు ఈనెల 6న ఆదేశించారు. ప్రతి మంగళవారం ఉపాధ్యాయులు ప్రాథమిక పాఠశాలలకు హాజరై విద్యార్థుల బ్రిడ్జి కోర్సు పురోగతిని సమీక్షించాలన్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమ, గురువారాల్లో విద్యార్థులకు అందుతున్న టీవీ తరగతులు, బ్రిడ్జి కోర్సుల పురోగతి, విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయాలన్నారు. సాంకేతిక సౌకర్యాలు లేని విద్యార్థులను 10 నుంచి 20 మందిని ఒక్కో ఉపాధ్యాయుడు దత్తత తీసుకోవాలని ఆదేశించారు.

### పద్మ అవార్డులకు
## దరఖాస్తులు పంపండి

వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన వారికి ప్రభుత్వం ప్రతిఏటా ఇచ్చే పద్మ అవార్డులకు ఈ ఏడాది దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈవో, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి సుస్మిత ఈనెల 5న ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అర్హులైన క్రీడాకారులు తమ దరఖాస్తులను ఆగస్టు 15లోపు పంపాలని కోరారు. జిల్లాలో అర్హులైన క్రీడాకారులు www.padmaawards.gov.inలో పొందుపరచిన మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను పీడీఎఫ్‌ల ద్వారా managers/saap@ap.gov.in మెయిల్ ఐడీకి పంపాలని కోరారు.

### సేద్యంలో...
## కొత్త పద్ధతులు పాటించాలి

వ్యవసాయంలో కొత్త యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించి తద్వారా సాగు ఖర్చు తగ్గించేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరి బాబు వ్యవసాయ అధికారులకు సూచించారు. ఇటీవల నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో వ్యవసాయ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 80వేల హెక్టార్లలో వరి సాగైందని, 6,800 హెక్టార్లలో వేరుశనగ, మరో వెయ్యి హెక్టార్లలో నువ్వుల పంట సాగైనట్లు చెప్పారు. అధునాతన పద్ధతులతో రైతులకు మేలు బాటలు వేయాలని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ జేడీఏ ఆనందకుమారితో పాటు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

### యోగా, ఆయుర్వేదం...
# మన జీవితంలో ఒక భాగం

**- వియస్‌యు వి.సి సుదర్శనరావు**

యోగా, ఆయుర్వేదం అనే రెండు ముఖ్యమైన అంశాలు మనదేశంలో ఎంతో ప్రాముఖ్యమైనవని విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ సుదర్శనరావు అన్నారు. వీఎస్‌యూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఈనెల 5న వివిధ రకాల ప్రాణాయామాలు, సరైన పద్ధతిలో శ్వాస తీసుకోవడంతో కరోనాను జయించవచ్చని ఆయన వివరించారు. ప్రస్తుతం యావత్ ప్రపంచం యోగాను దైనందిన జీవితంలో ఒక భాగంగా అలవాటు చేసుకుంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి యూనివర్సిటీలో యోగాపై ఒక ప్రత్యేకమైన మూడు నెలల డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అనంతరం వివిధ రకాల ప్రాణాయామాలతో ఊపిరితిత్తుల సామర్థ్యం, రోగ నిరోధక శక్తిని పెంపొందించవచ్చని శాస్త్రీయ పద్ధతులను డెమో ద్వారా యోగా నిపుణురాలు స్వప్న వివరించారు. వీయస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్ విజయకృష్ణారెడ్డి, ఎన్ ఎస్ ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఏం చేశారని..'రైతు దినోత్సవం'?

**- సోమిరెడ్డి విమర్శ**



రైతులకు ఏం చేశారని రాష్ట్ర ప్రభుత్వం రైతు దినోత్సం పేరుతో ప్రకటనలు చేస్తోంది?.. అంటూ మాజీమంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతు దినోత్సవం పేరుతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రకటనల్లో వాస్తవాలు లేవని ఆయన ఆరోపించారు. మీరు అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరం 2019-20లో వ్యవసాయ అనుబంధ రంగాలకు బెడ్జెట్‌లో 20,250 కోట్లు కేటాయించారని, అయితే ఖర్చుపెట్టింది మాత్రం కేవలం 7481 కోట్లు మాత్రమేనని, మళ్ళీ ఈ ఏడాది 22వేల కోట్లు కేటాయించారని, అవన్నీ వెచ్చించిన తర్వాతనే రైతుల గురించి మాట్లాడండి అని ఆయన పేర్కొన్నారు. టిడిపి హయాంలో 68 లక్షల మంది రైతుల భూములకు సంబంధించి 129 లక్షల భూసార పరీక్షలు నిర్వహించామని, మీ హయాంలోనూ ఆ పరీక్షలను పూర్తిగా నిలిపేసిందని, రైతులకు కనీసం విత్తనాలను కూడా సకాలంలో మీరు అందించలేకపోతున్నారని ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆయన విమర్శించారు. రైతుల శ్రేయస్సు కోసం తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో చేసిందని, రైతుల రుణాలను 16వేల కోట్లదాకా మాఫీ చేశామని ఆయన పేర్కొంటూ, ఇప్పటి వైకాపా ప్రభుత్వం రైతుల అభ్యున్నతికేమీ చేయకుండానే ఏదేదో చేసేస్తున్నామంటూ ప్రకటించుకోవడం సరికాదన్నారు. ఇకనైనా ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన అన్ని రకాల పథకాలను ప్రవేశపెట్టి రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

### భక్తుల కొంగుబంగారం...
# జొన్నవాడ కామాక్షితాయి ఆలయం





***జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయం భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి. నెల్లూరుకు సమీపంలోని బుచ్చిరెడ్డిపాళెం మండలంలో.. పావన పినాకినీ నదీ తీరాన వెలసి ఉన్న ఈ ఆలయం ఎంతో పురాతనమైనది. ఈ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులకు సకల శుభాలు కలుగుతాయి. అందుకే రాష్ట్రవ్యాప్తంగా భక్తజనులు ఈ ఆలయానికి విచ్చేసి స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని తరిస్తుంటారు.***



## మన దేవాలయాలు ③

జొన్నవాడ దేవాలయం రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన అమ్మవారి దేవాలయాల్లో ఒకటి. కామితార్థప్రదాయిని జొన్నవాడ కామాక్షమ్మ అని రాష్ట్రవ్యాప్తంగా పేరు. ఈ ఆలయానికి పురాణ చరిత్ర ఎంతో ఉంది. ఎప్పుడో త్రేతాయుగంలో కశ్యప మహర్షి యజ్ఞం చేసిన ప్రదేశం కనుక ఈ ప్రాంతానికి జొన్నవాడ (యజ్ఞవాటిక) అనే పేరు వచ్చిందని ప్రాచీన చరిత్ర. కశ్యపుడు ఈ ప్రాంతాన్ని యజ్ఞవాటికగా చేసుకుని యజ్ఞం చేయగా త్రేతాగ్నులు ఉద్భవించాయని, పరమశివుడు యజ్ఞ కుండంలోంచి మల్లికార్జునస్వామిగా ఆవిర్భవించాడని, అది తెలుసుకున్న పార్వతీదేవి కైలాసం నుంచి పరమ శివుడిని వెదుక్కుంటూ జొన్నవాడకు తరలిరాగా, భక్తులను వీడిపోలేని పరమ శివుడు.. నీవు కూడా ఇక్కడే ఉండి భక్తులను కటాక్షిస్తుండాలని నూచించాడని, స్వామివారి కోరికను అనుసరించి నాటి నుంచి పార్వతీదేవి ఇక్కడ కామాక్షిదేవిగా ప్రసిద్ధిచెందినట్లు పురాణాలు పేర్కొంటున్నాయి.

### బ్రహ్మాండపురాణంలోనూ ఆలయ ప్రశస్తి :

ఎంతో ప్రాచీనకాలం నాటి బ్రహ్మాండ పురాణంలో కూడా జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారి దేవాలయం ప్రాశస్త్యం గురించి ఉంది. సాక్షాత్తూ పరమశివుడు, పార్వతీదేవి ప్రతిరూపాలుగా ఇక్కడ మల్లికార్జునస్వామి, కామాక్షిదేవి వెలిశారని పూర్వచరిత్ర. అందుకే, కామితార్థప్రదాయిని అయిన కామాక్షితాయి అమ్మవారిని సేవించుకున్నవారికి ఎలాంటి బాధలు ఉండవు. ఈ దేవస్థానం సన్నిధిరేవుకు కశ్యపతీర్థమని కూడా పేరు. ఇక్కడ స్నానమాచరించిన భక్తుల సర్వ దోషాలు తొలగిపోయి, సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి.

### మహాకవి తిక్కన యజ్ఞం చేసిన ప్రాంతం :

మనుమసిద్ది మహారాజు కొలువులో మంత్రిగా సేవలందించిన తిక్కనమాత్యుడు, ఆ తర్వాతి కాలంలో మహాభారతాన్ని అత్యద్భుతంగా ఆంధ్రీకరించి తెలుగు భాషామతల్లికి కంఠహారంగా సమర్పించాడు. ఈ సందర్భంగా తొలుత జొన్నవాడలోనే యజ్ఞం చేసి తిక్కన సోమయాజిగా ఖ్యాతిచెందాడు.

ఈ ఆలయంలో భక్తులు రాత్రి వేళల్లో నిద్రచేస్తుండడం, స్వప్నదర్శనంలో అమ్మవారు ఆ భక్తుల కోరికలు తీరుస్తుండడం ఈ ఆలయం ప్రత్యేకత. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఆ జగన్మాత కరుణాకటాక్ష వీక్షణాలకు పాత్రులవుతుంటారు. గతంలో జగద్గురు ఆదిశంకరాచార్యులు కూడా ఇక్కడికి వచ్చి ఈ ఆలయాన్ని సందర్శించారని, అప్పట్లో అమ్మవారు ఉగ్రరూపంతో ఉండడం చూసి ఆదిశంకరాచార్యులవారు తమ పూజలు, ప్రార్థనలతో అమ్మవారిని శాంతింపజేసినట్లు కూడా పెద్దలు చెప్తుంటారు. గ్రహపీడలతో బాధపడేవారికి అమ్మవారి దర్శనంతో అలాంటి బాధలన్నీ తొలగిపోతుంటాయని ప్రతీతి.

### వేడుకగా నవరాత్రి ఉత్సవాలు :

దసరా పండుగ రోజుల్లో అమ్మవారికి శరన్నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా జరుగుతుంటాయి. ముఖ్యంగా శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిల కల్యాణోత్సవానికి భక్తులు వేలసంఖ్యలో తరలివస్తుంటారు. సంతానం లేని దంపతులు, దీర్ఘకాలంగా వివాహం కాని వారు ఈ ఉత్సవాలకు వచ్చి, ధ్వజారోహణం రోజున ఆలయంలో ఇచ్చే కొడిముద్ద ప్రసాదం కోసం బారులు తీరి ఉంటారు. అమ్మవారి ప్రసాదం ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుందని, ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులైనా సమసిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

వీక్షణం
-మంజీర

## ఎండని...
# ఏడో చేప

'అనగనగా ఒక రాజు– ఏడుగురు కొడుకులు – ఏడు చేపలు' ఈ కథ తెలుగు వారి బాల్యంలో ఒక భాగం. ఈ కథలో ఆరు చేపలు... చక్కగా ఎండిపోయి తొలి సీన్‌లోనే ఫ్రేమ్ అవుట్ అయిపోయే పాత్రలు. ఏడో చేపే నిత్య కథా వస్తువు. ఇప్పుడు రాష్ట్రంలో నడుస్తున్న 'రాజు' కథ కూడా అలాంటిదే.

వైఎస్‌ఆర్‌సీపీ... 2019 ఎన్నికల్లో 151 శాసనసభ స్థానాలతో ఘనవిజయం సాధించడం, 22 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకుని విజయవంతంగా త్రిశత దినోత్సవం పూర్తి చేసుకున్న రాజకీయ కథా చిత్రమ్. ఇందులో ఎండని ఏడో చేప రఘురామకృష్ణం రాజు(ఆర్‌ఆర్‌కేఆర్).

### ఈ కీర్తన ఏ రాగం?

ఈ నడుస్తున్న చరిత్రలో ఆర్‌ఆర్‌కేఆర్ గొంతులో పలికినది అసమ్మతి వాదమా, అసంతృప్త రాగమా, ధిక్కార స్వరమా? తన కీర్తన ఏ కేటగిరీకి చెందుతుందనే స్పష్టత ఆయనకు గొంతు విప్పేనాటికి లేదనే చెప్పాలి. కొంచెం సూక్ష్మంగా తరచి చూస్తే మనసులో రగిలిపోతున్న 'అసంతృప్తి' ప్రధాన హేతువుగా కనిపించక మానదు. ఈ పొలిటికల్ సినారియోకి బీజం కూడా అదే. అయితే ఇక్కడ ఆదిలోనే... అంటే ఆయన అసంతృప్తిని వ్యక్తం చేయడంలోనే అపశృతి దొర్లింది. పిల్లలు అమ్మానాన్నల మీద అలిగినప్పుడు ఆ అలకను ఎవరి దగ్గర ప్రకటించాలి? నానమ్మ–తాతయ్యల దగ్గర బుంగమూతి పెట్టుకోవాలి. అంతే తప్ప, పక్కింటి పిల్లవాడి నానమ్మ– తాతయ్యల దగ్గర ఇంటి చిట్టా విప్పితే పరిణామాలు ఎలా ఉంటాయి? ఇప్పుడు కూడా అదే అయింది.

### ప్రకటించడం ఇలాగేనా?

ముఖ్యమంత్రిని కలవడం కొంచెం కష్టమే. ఇది ఒక్క ఆర్‌ఆర్‌కేఆర్ సమస్య మాత్రమే కాదు. ఏడాది కాలంగా ఎందరో శాసనసభ్యులు చెబుతున్న మాటే ఇది. 'నాన్న మరీ ఇంత బిజీగా ఉండడం మాకు నచ్చడం లేదు. మా కోసం కూడా కొంత టైమ్ కేటాయించమని చెప్పమ్మా' అని అమ్మ దగ్గర మారాం చేయాలి. నానమ్మ దగ్గర గారాలు పోవాలి. అదీ కుదరకపోతే చేతిలో ఉన్న వస్తువును నాన్న ఎదురుగా నేలకేసి కొట్టి అటెన్షన్ తన వైపు తిప్పుకోవాలి. ఆర్‌ఆర్‌కేఆర్ ఇవేవీ చేయకుండా ఇంటి కిటికీ అద్దం పగలకొట్టి తన అసంతృప్తిని ఊరంతటికీ తెలిసేలా చేశారు. ఇలాంటిది జరిగినప్పుడు ఇంట్లో వాళ్లకంటే పక్కింటి వాళ్లే ముందు పట్టించుకుంటారు. ఎందుకిలా చేశావని అడిగి మరీ... ఇంటి గుట్టు విప్పి చెప్పేలా ప్రభావితం చేస్తారు. పిల్లాడు ఇంటి పరువు తీస్తున్నాడని ఇంట్లో పెద్దవాళ్లలో ఆందోళన మొదలవుతుంది. కట్టడి చేయడం మొదలవుతుంది. చివరికి ఈ విషయంలో ఇంట్లో అందరూ ఇన్‌వాల్వ్ అవుతారు. కానీ సమస్యకు మూలాన్ని మాత్రం అందరూ మర్చిపోతారు.

### ఎక్కడ మనసు విప్పాలి?

మొత్తం పరిణామక్రమంలో ఎక్కడో అసలు విషయం గాడి తప్పుతుంది. ఆర్‌ఆర్‌కేఆర్ మాత్రం కొంచెం త్వరగా గాడితప్పారు. పార్టీ పెద్దలు పిలిచి మాట్లాడే వరకు గంభీరంగా ఉండాల్సింది. తన మనసులోని మాటను పెద్దలతో మాత్రమే పంచుకుని ఉండాలి. అలా కాకుండా అన్నింటికీ, అందరికీ స్పందించసాగారు. వైఎస్‌ఆర్‌సీపీ, బీజేపీ, టీడీపిల తీర్థాలు పుచ్చుకుని తిరిగి ఈ గూటికి వచ్చాడని సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలు కాగానే దెబ్బతిన్న పులిలాగ రెచ్చిపోయారు. 'ఆనాడు పీకే (ప్రశాంత్ కిశోర్) టీమ్ వచ్చి రిక్వెస్ట్ చేస్తేనే తిరిగి వైఎస్‌ఆర్‌సీపీలోకి రావడానికి ఒప్పుకున్నాను' అన్నాడు. నిజమే... పీకే టీమ్ మిమ్మల్ని సంప్రదించింది... అంటే మీ బలాన్ని గుర్తించిందనే అర్థం. అలాగే మీరు పీకే టీమ్ ప్రతిపాదనను అంగీకరించారు అంటే... పార్టీ బలం మీద మీకు సరైన అంచనా ఉందని కూడా అర్థం. ఇక్కడ జరిగింది విన్–విన్ డీలే. ఎవరికీ నష్టం జరగలేదు. ఒక ఎంపీనై ఉండి, నేను సిఎంను కలవలేకపోవడం ఏంటి? అనే ప్రశ్నను కూడా ఎవరూ తప్పుపట్టలేరు.

### చీమ కుట్టడమే కారణమా?

ఒక రాజకీయ పార్టీలో ఒక సమస్య ఎదురైతే, ఆ సమస్యను పరిష్కరించడానికి పెద్దలు పూనుకోవాల్సిందే. అలిగిన పిల్లవాడిని అనునయించి దారికి తెచ్చారా లేక అధికారంతో అదుపు చేశారా... అనేది కూడా చాలా ముఖ్యం. ఈ అంతర్గత సమస్యను వైఎస్‌ఆర్‌సీపీ ఎలా పరిష్కరిస్తుందోనని రాష్టం అంతా ఎదురు చూస్తోంది. రాష్ట్రంలో అన్ని కళ్లూ తమ వైపే ఉన్నాయనే గమనింపు వైఎస్‌ఆర్‌సీపీ నాయకత్వానికి కూడా ఉంది. ఎండని ఏడోచేప దగ్గరకు స్వయంగా రాజే వెళ్లాడు. ఎందుకు ఎండలేదని అడిగాడు. చేప చెప్పిన కారణాలతో సమగ్రంగా మూలకారణం వరకు వెళ్లాడు. మూల కారణం చీమకుట్టడమంత చిన్నదే. అయినా సరే... మూలం వరకు అన్వేషణ జరగాల్సిందే. ఈ సమస్య పరిష్కారం పట్ల పార్టీ స్పందించే తీరు, భవిష్యత్తులో పార్టీలోని నాయకులకు ఒక సందేశం కానున్నదనడంలో ఎలాంటి సందేహం లేదు.

# భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



ఆది గురువు పరమేశ్వరుడైతే తొలి గురువుగా భావించే వ్యాస భగవానుని జన్మదినాన్ని పురస్కరించుకుని వ్యాసపూర్ణిమ లేదా గురుపూర్ణిమ వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తమకు చదువు చెప్పిన, మార్గదర్శనం చేసిన గురువులను స్మరించుకుంటూ వారిని సన్మానించుకుని తరిస్తారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈనెల 5న కరోనా నిబంధనలను పాటిస్తూ ఆలయాల్లో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. నెల్లూరు గాంధీబొమ్మ వద్ద నున్న షిరిడి సాయిబాబా మందిరంలో ఉదయం నుంచి బాబా వారికి పూలంగి సేవ, హారతులు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సామూహిక సహస్రనామ పూజలు జరిగాయి. ఆలయ ఛైర్మన్ మన్నెం అమరనాథరెడ్డి పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

### బాలాజీనగర్‌లో....

బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో కరోనా నేపథ్యంలో భక్తులకు సాయినాథుని దర్శనానికి మాత్రమే అనుమతి ఇచ్చారు. భక్తులు మాస్కులు ధరించి సామాజిక దూరాన్ని పాటిస్తూ బాబా దర్శనం చేసుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి పర్యవేక్షణలో సేవాదళ సభ్యులు బాబీ సాయి వారి మిత్ర బృందం పర్యవేక్షించారు.

### కావేరినగర్‌లో....

కొత్తూరు కావేరినగర్‌లోని షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం 5 నుండి 7 గంటల వరకు విశేష పూజలు నిర్వహించారు. వసంతరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కె.బాలచంద్రారెడ్డి, కార్యదర్శి నాగమల్లి బాబు, కమిటీ సభ్యులు గోవిందరాజు సుభద్రాదేవి, నెట్టెం రాఘవేంద్రరావులు పర్యవేక్షించారు.

### రామకృష్ణానగర్‌లో...

నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీ రామకృష్ణానగర్‌లోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా మందిరం మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబూరావు ఆధ్వర్యంలో బాబావారికి విశేష పూజలు, షిరిడి హారతులను ఆలయ అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు. భక్తులు సామాజిక దూరం పాటిస్తూ బాబా వారిని దర్శించుకున్నారు. వివి సుబ్బయ్య ఆధ్వర్యంలో భజన కార్యక్రమం జరిగింది.

## రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేయాలి

శాస్త్రవేత్తలు రైతులకు ఉపయోగపడే పరిశోధనలు చేయాలని, అప్పుడే శాస్త్రవేత్తలు కలకాలం గుర్తుంటారని ఆచార్య ఎన్ జీ రంగా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి (మార్కెటింగ్, కో–ఆపరేటివ్) వై.మధుసూదనరెడ్డి అన్నారు.

ఈనెల 8న నెల్లూరు ముత్తుకూరు రోడ్డులోని వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని ఆయన సందర్శించి పరిశోధనలను పరిశీలించి సూచనలు చేశారు. నెల్లూరు ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్, పొదలకూరు ఏఆర్‌ఎస్ అధిపతి డాక్టర్ ఓ.వెంకటేశ్వర్లు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జి.లలితా శివజ్యోతి, ఏఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త యు.వినీత పాల్గొన్నారు.

## భగవంతుని కీర్తించేదే.. భాగవతం

**- అవధాని కోట రాజశేఖర్**

భగవంతుని గుణగానం చేసేదే భాగవతమని, భాగవతాన్ని వినడం ద్వారా భక్తులకు సకల శుభాలు కలుగుతాయని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. కోవూరు సమీపంలోని ఇనమడుగు గ్రామంలో ఉన్న శ్రీ సత్యానందాశ్రమంలో రెండవ పీఠాధిపతి శ్రీ బ్రహ్మానందతీర్థస్వామివారి తృతీయ ఆరాధన సందర్భంగా ఆయన ఇటీవల 8 రోజుల పాటు భాగవత ప్రవచనం చేశారు. భగవంతుని కీర్తించడంతో పాటు, ఎందరో భక్తుల కథలను కూడా భాగవతం వివరిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 5న గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువు ప్రాధాన్యతను వివరిస్తూ, అజ్ఞానపు చీకట్లను తొలగించి విజ్ఞానపు వెలుగులందించేది, ఆ భగవంతుని చేరుకునే మార్గాన్ని చూపేది కూడా గురువేనని అన్నారు. అనంతరం కోట రాజశేఖర్‌ను సత్యానందాశ్రమ పీఠాధిపతి శ్రీహరితీర్థస్వామీజీ సత్కరించి, ఈ ఆశ్రమానికి ఎంతోకాలంగా చీమకుర్తి వెంకటేశ్వరరావు పీఠాధిపతిగా ఉన్నారని, రెండవ పీఠాధిపతిగా కోట రాజశేఖర్ ఉంటారని ప్రకటించి ఆశీర్వదించారు. వ్యాపారవేత్త ముక్కాల సత్యనారాయణ, ప్రముఖ సిద్ధాంతి చేబ్రోలు రామకృష్ణయ్య వారి కుటుంబసభ్యులు తదితరులు అవధాని రాజశేఖర్–గిరిజాకుమారి దంపతులను సన్మానించారు. శ్రీ పురుషోత్తమతీర్థస్వామీజీ, ఆశ్రమ కార్యదర్శి పోలిశెట్టి నాగేశ్వరరావు, జెట్టి రామచంద్రారెడ్డి, కైలాసం చంద్రారెడ్డి, జి.వేణుగోపాల్, దొంతంశెట్టి చలపతి తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎన్నికల పర్యవేక్షకులు వీరే

నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాలకు గ్రామ, వార్డు, మండల పట్టణ అనుబంధ కమిటీల ఎన్నికల పర్యవేక్షకులను నియమించినట్లు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు రైతు విభాగానికి రావూరు సుందరరామిరెడ్డి, మహిళా విభాగానికి పనబాక భూలక్ష్మి, తెలుగు యువత విభాగానికి కాకర్ల తిరుమలనాయుడు, తిరుపతి పార్లమెటు పరిధిలోని నాలుగు నియోజకవర్గాలకు రైతు విభాగానికి యదనపర్తి రాజగోపాల్‌రెడ్డి, మహిళా విభాగానికి మట్టం శ్రావణి, యువత విభాగానికి శ్రీపతిబాబును నియమించినట్లు తెలిపారు. నెల్లూరు గ్రామీణ మండల పార్టీ కమిటీ అధ్యక్షునిగా పముజుల ప్రదీప్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పు కృష్ణను ఎంపిక చేసినట్లు తెలిపారు.

## ఆర్టీసీలో ఖచ్చితంగా నిబంధనలు

నెల్లూరు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్ లో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆర్టీసీ ఆర్‌ఎం పివి శేషయ్య తెలిపారు. ఈనెల 8న తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ బస్టాండు, బస్సులు, ప్రయాణీకులు కూర్చునే కుర్చీలను ప్రతిరోజూ శానిటైజ్ చేస్తున్నామన్నారు. బస్సులు ఎక్కే సమయంలో భౌతిక దూరం పాటించేలా వాలంటీర్లను నియమించామన్నారు. కార్మికులకు వ్యక్తిగతంగా శానిటైజేషన్ సీసాలు, మాస్కులు, గ్లౌజులు అందజేస్తున్నామన్నారు. ప్రయాణీకులు, కార్మికులు ఎవరూ భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు.

## పారిశుద్ధ్యం బాగుంటే.. రోగాలు రావు

పారిశుద్ధ్యం బాగుంటే రోగాలు రావని, పారిశుద్ధ్య నిర్వహణకు అల్ఫా మెరైన్ యాజమాన్యం రూ.3లక్షలు ఇవ్వడం అభినందనీయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. ఈనెల 6న కొడవలూరు మండలం గండవరంలోని గౌతంనగర్‌లో ఆయన మాట్లాడుతూ పేదలందరికి ఇళ్ళ స్థలాలు అందాలన్నారు. డీపీవో ధనలక్ష్మి, డీసీఎమ్ఎస్ ఛైర్మన్ వీరి చలపతిరావు పాల్గొన్నారు.

### వడివడిగా...

# విశాఖ వైపు అడుగులు పడుతున్నాయి

***రాజధాని అనేది ఒక గ్రోత్ ఇంజిన్... అంటే అభివృద్ధి యంత్రంలా ఉండాలి అన్నది ప్రాపంచిక సూత్రం. అన్నిరకాల హంగులతో పాటు కీలకమైన పారిశ్రామిక, సేవా రంగాలు పరుగుబాట పట్టి దశలవారీగా అభివృద్ధిని విస్తరించుకుంటూ, అన్ని రకాల అవసరాల కోసం ఉపాధి అవకాశాలు పెంచుతూ రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు వలస వచ్చేలా, తద్వారా ప్రజల జీవన ప్రమాణాలతో పాటు రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరగడంతో పాటు మిగతా రాష్ట్రం అంతా ఆ అభివృద్ధి కిరణాలు ప్రసరించేలా రాజధాని ఉండాలన్నది ఒక సక్సస్‌ఫుల్ కాన్సెప్ట్. అలాచూస్తే మన రాష్ట్రంలో విశాఖని మించిన పట్టణం ప్రస్తుతం మరేదీ లేదు. ఇక్కడ వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకన్నా రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అన్నది సుస్పష్టం.***

## విశాఖతో అమరావతికి పోలికే లేదు...

విశాఖతో అమరావతిని ఏ రకంగానూ పోల్చలేం. విశాఖ అర్బన్ జనాభానే 20 లక్షలు ఉంటే రూరల్‌లో మరో 25 లక్షలు.. అంటే విశాఖ జిల్లాలో దాదాపు 50 లక్షల జనాభా ఉంది. అదే అమరావతి చూస్తే ఇప్పుడు నిర్మించతలపెట్టిన రాజధాని 29 గ్రామాల జనాభా చూస్తే గరిష్టంగా 80వేల నుంచి లక్ష మంది. ఇక గుంటూరు, విజయవాడ ఆ ప్రాంతాలన్నీ కలుపుకున్నా 5 లక్షలమందే అన్నది అప్పటి మాస్టర్ ప్లాన్‌లో పేర్కొన్న సంఖ్య. ఇక్కడే అర్థమవుతోంది, ఒక రాజధాని అంటే కనీసం 20 లక్షల జనాభా కూడా లేకుండా ప్రారంభం అయితే ఇక అక్కడ అభివృద్ధి చెందాలంటే ఎన్ని దశాబ్దాలు పడుతుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రాజధానిలో అసలు జనమే లేకుంటే సేవారంగం కానీ, విద్య, వైద్య రంగాలు కానీ, పారిశ్రామికీకరణ కానీ, ఇక ఏదైనా అసలు ఊహించలేం. అందులోనూ అమరావతిలోని సామాజిక సమీకరణల దృష్ట్యా బయటప్రాంతంనుంచి ఇక్కడకు వలసలు వచ్చేందుకు కూడా జనం ఆసక్తి కనపరచని నేపథ్యం కావడంతో విశాఖే బెస్ట్ అన్నది బోస్టన్ కన్సల్టన్సీ నుంచి విశ్రాంత ఐఏఎస్ జీఎన్ రావ్ వరకు ఇచ్చిన నివేదికలు చెప్తూనే ఉన్నాయ్.

ఇక కోర్టులో అమరావతి రైతులతో పాటు టీడీపీ నేతలు వేసిన కేసులకు కూడా త్వరలోనే పరిష్కారం లభించబోతోంది. పరిపాలనా వికేంద్రీకరణ, సీఆర్డీఏ రద్దు బిల్లుల విషయంలో మండలి అంగీకరించకపోయినా ఈ నెల 17కి అవి వాటంతట అవే ఆమోదం పొందనున్నాయి. మొదటిసారి అసెంబ్లీ ఆమోదించిన ఏ బిల్ అయినా కౌన్సిల్ ఆమోదించినా, తిరస్కరించినా 90 రోజుల తర్వాత మళ్ళీ అసెంబ్లీ రెండోసారి అవే బిల్లులను ఆమోదించి కౌన్సిల్‌కి పంపితే... మళ్లీ తిరస్కరించినా 30 రోజుల సమయం తర్వాత ఆ బిల్లులు వాటంతట అవే ఆమోదం పొందినట్టే. కేవలం కాల యాపన తప్ప ఆ బిల్లులను అడ్డుకునే శక్తి శాసనమండలికి ఉండదు. కాబట్టి జూన్ 17న అసెంబ్లీలో ఈ రెండు బిల్లులను రెండోసారి ఆమోదించి మండలికి పంపారు కాబట్టి ఇక ఈనెల 17కి వాటంతట అవి ఆమోదం పొందినట్టే. సూత్రప్రాయంగా గవర్నర్‌కి పంపి ఆయన ఆమోదం తర్వాత అవి అమల్లోకి వచ్చినట్టే. ఆ బిల్లులను కోర్టుకి సమర్పిస్తే ఆ కేసులనుంచి రాజధాని తరలింపుకు విముక్తి లభించినట్టే. దీనితో ప్రశాంతంగా రాజధాని తరలింపుని చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు అధికారులు.

## విశాఖలో వేగంగా కార్యనిర్వాహక రాజధాని పనులు

ఇటీవల విశాఖలో వీఐపీల ఆకస్మిక పర్యటనలు, ప్రజాప్రతినిధుల రాజధాని ప్రకటనలు రాజధాని తరలింపు ప్రక్రియకు ఊతమిస్తున్నాయి. మూడు రాజధానుల ప్రకటన వచ్చినప్పటి నుండి అందరి దృష్టి విశాఖపైనే వుంది. మొన్న సీఎంవో ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, నిన్న డీజీపి గౌతం సవాంగ్ పర్యటనలతో విశాఖ పరిపాలన రాజధానిగా పరుగులు పెడుతుందనే సంకేతాలు వస్తున్నాయి.

విశాఖ పరిపాలన రాజధానిగా ముఖ్యమంత్రి ప్రకటన వచ్చినప్పటి నుండి సాగరతీరంలో సందడి మొదలైంది. వీఐపీల పర్యటనలతో ఆ స్పీడ్ మరింత పెరిగింది. అసలు విశాఖకు తొలి నుండి కూడా ఆ ప్రాధాన్యం వుంది. వాస్తవానికి గత ప్రభుత్వం కూడా పేరుకు అమరావతి అని చెప్పినా అంతర్జాతీయ సెమినార్స్, సమ్మిట్స్‌కు వైజాగ్ వేదిక అయింది. తాజా పరిణామాల నేపథ్యంలో విశాఖలో సీఎం నివాసం, కార్యాలయాలు, సెక్రటేరియేట్, ఇతర ముఖ్య విభాగాలు ఎక్కడెక్కడ రావాలన్న అంశంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కసరత్తులు మొదలయ్యాయి.

రాజధాని ప్రకటన రాగానే ఐటీ సెజ్, రుషికొండ, తొట్లకొండ, కాపులుప్పాడ వంటి ప్రాంతాల్లో సీఎం కార్యాలయం వస్తుందన్న ప్రచారం జరిగింది. అయితే వీటిలో స్పష్టత లేకున్నా, గత నెలలో సీఎంవో ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తొట్లకొండ,రుషికొండ ప్రాంతాలను పరిశీలించారు. తాజాగా డీజీపీ గౌతం సవాంగ్ కూడా తొట్లకొండ, రుషికొండ, ఐటీ సెజ్ ప్రాంతాలను మరోసారి పరిశీలించారు. దీంతో వీరి పర్యటనలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. విశాఖలో ప్రభుత్వ భూములు అందుబాటులో వుండటంతో పాటు ఇప్పటికే ఆర్థిక రాజధానిగా, అత్యంత అధునిక మౌళికసదుపాయాలు వున్న ప్రాంతంగా అభివృద్ధి పథంలో వైజాగ్ వుండటంతో రాజధాని హంగులు అన్నీ సరిపోతాయి. దీంతో ప్రస్తుతం వున్న అవరోధాలను తొలగించుకుని వేగంగా విశాఖలో అడుగుపెట్టాలని ముఖ్యమంత్రి మదిలో ఆలోచన.. మరి ఆ శుభముహర్తం విజయదశమి రోజునే ఉండొచ్చని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

---

# అక్టోబర్‌కు బ్యారేజీలు పూర్తి చేస్తాం..

నెల్లూరు జిల్లాలోని సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణాన్ని అక్టోబర్ నాటికి పూర్తి చేసి సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలుగుగంగ ప్రాజెక్ట్ ఎస్ఈ హరినారాయణ రెడ్డి తెలిపారు. ఈనెల 7న ఆయన బ్యారేజీ పనులు పర్యవేక్షించి మాట్లాడుతూ కరోనా వల్ల కూలీలు ఇళ్ళకు వెళ్ళడంతో పనుల్లో కొంత జాప్యం జరిగింద న్నారు. బ్యారేజీ నిర్వాహకులు రాజు, ఇంజినీర్లు, ఏఈ విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

---

# బీజేపీలో టీడీపీ

## విలీనమే శరణ్యమా..?

***ఉమ్మడి రాష్ట్రంలో 1982 మార్చి 29న ఊపిరి పోసుకున్న తెలుగుదేశం పార్టీ త్వరలో తెరమరుగు కానుందా....? బీజేపీలోకి వీలీనం కావాలని చూస్తోందా.. అవుననే అంటున్నాయి రాజకీయ వర్గాలు.***

ఎదురులేని పార్టీగా ఇండియన్ నేషనల్ కాంగ్రెసుపార్టీ చెలామణి అవుతున్న రోజులలో, ముఖానికి రంగులు వేసుకునే వాడు రాజకీయాలు ఏం చేయగలడు, అన్న వారి అంచనాలను తలక్రిందులు చేస్తూ, పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి 1983 జనవరి 29న ఆంధ్రప్రదేశ్ 10వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు.

అయితే 1995 సెప్టెంబర్ 1వ తేదినుండి తెలుగుదేశం పార్టీ పూర్తిగా చంద్రబాబు ఆధీనం అయిపోయింది. తాను పెట్టిన పార్టీ ఒక దగుల్బాజీ, ఒక మోసగాడు, ఒక విశ్వాసఘాతకుడి చేతుల్లోకి వెళ్ళింది అంటూ పదేపదే చెప్తూ మనోవేదనతో 1996 జనవరి 18న తుదిశ్వాస విడిచాడు ఎన్‌టి రామారావు.

## పార్టీ ప్రతిష్టని దిగజార్చిన చంద్రబాబు

ఒకసారి తెలుగుదేశం పార్టీ చరిత్రను పరిశీలిస్తే ఒక్క 1983లో తప్ప ఆ పార్టీ ఎప్పుడూ ఒంటరిగా పోటీచేసి గెలవ లేదు. ఎన్‌టిఆర్‌కి నాదెండ్ల భాస్కర్‌రావు పొడిచిన వెన్నుపోటుకు సానుభూతిగా 1985లో కామ్రేడ్లు తప్ప బీజేపీ సహా అనేక ఇతర పార్టీలు రామారావుకు అండగా వుండి ఆయనను అఖండ మెజారిటీతో గెలిపించాయి. ఆ తరువాత చంద్రబాబు ఎప్పుడూ ఒంటరిగా పోటీ చెయ్యలేదు, చేసినా గెలవలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ పార్టీ సిద్ధాంతాలనైతే వ్యతిరేకించి ఆనాడు రామారావు పార్టీని స్థాపించాడో అదే కాంగ్రెస్‌పార్టీతో పొత్తు పెట్టుకునే స్థాయికి చంద్రబాబు దిగజారి తనతోపాటు పార్టీ ప్రతిష్టను కూడా మంట కలిపేశాడు.

ఇక 2019 ఎన్నికల తరువాత చంద్రబాబుకి మిగిలింది కొద్దో గొప్పో క్యాడర్ తప్ప క్యారెక్టర్ కాదు. ఇపుడు అయన పరిస్థితి అధ్వాన్నంగా మారింది. జాతీయ స్థాయి నుండి వీధి స్థాయికి ఆయన గ్రాఫ్ పడిపోయింది.

తెలంగాణాలో చంద్రబాబు కోలుకోలేని స్థాయిలో కేసీఆర్ దెబ్బ కొట్టడంతో పార్టీని సైతం మడతపెట్టి మూటా ముల్లె సర్దుకుని అమరావతికి వచ్చేశాడు. ఇక ఢిల్లీలో ఆయనకి అపాయింట్‌మెంట్ ఇచ్చేవాళ్ళు కూడా లేరు. అక్కడి వాళ్ళు చంద్రబాబును పార్టీ అధినేతగా కాదుకదా, కనీసం ఒక మనిషిగా కూడా గుర్తించడం లేదు.

## విలీనం తప్ప.. మరో మార్గం లేదు..

ఇలాంటి తరుణంలో అటు తెలుగుదేశం కార్యకర్తలలోనూ, నాయకగణంలోను మెదులుతున్న ఒకే ఒక ఆలోచన విలీనం.

జగన్‌మోహన్‌రెడ్డి వేగానికి తట్టుకునే వయసు బాబుకు లేదు, పార్టీకి నాయకత్వం వహించే సమర్థత చినబాబుకు లేదు. ఇలాంటి పరిస్థితులలో కనుచూపుమేరలో పార్టీకి భవిష్యత్తే లేదు, కాబట్టి ప్రజారాజ్యం తరహాలో పార్టీని బీజేపీలో విలీనం చేస్తే అటు వ్యక్తిగతంగా చంద్రబాబుకి ఇటు పార్టీపరంగా తెలుగుదేశం శ్రేణులకు కలిసొచ్చే అవకాశాలు దండిగా వున్నాయి.

బీజేపీ కూడా ఇప్పుడే నిర్ణయం తీసుకునే అవకాశం లేక పోయినా భవిష్యత్తులో వారు కూడా విలీనం ప్రతిపాదనతో తెలుగుదేశం వైపు మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదు.

## బాబు లేని టీడీపీకే బీజేపీ మొగ్గు..

చంద్రబాబు వల్ల బీజేపీకి నష్టం తప్ప లాభం లేకపోయినా, తెలుగుదేశానికి గ్రామస్థాయి నుండి వున్న పటిష్టమైన కార్యకర్తల వ్యవస్థ వల్ల బీజేపీకి ఉపయోగం ఉంటుందన్నది వారి అంచనా, తద్వారా బీజేపీ బలపడే అవకాశాలు లేకపోలేదు. అయితే ఇక్కడ చంద్రబాబుతో సహా వున్న తెలుగుదేశాన్ని బీజేపీలో కలుపుకోవడానికి వారు ముందుకు రాకపోవచ్చు. ఒకే ఒక వ్యక్తి వ్యక్తిగత చరిష్మాతో తెలుగు రాష్ట్రాలలో అతిపెద్ద శక్తిగా అవతరించిన తెలుగుదేశం ఇప్పుడు అదే స్థాయిలో మరో వ్యక్తి స్వార్థపూరిత కుటిల వైఖరితో సర్వనాశనం అయ్యిందని గ్రహించగలిగిన మేధావి వర్గం బీజేపీలో వుంది. కాబట్టి చంద్రబాబు లేని తెలుగుదేశాన్ని వారు స్వాగతిస్తారు తప్ప చంద్రబాబుకు ఉన్న 'ఘనమైన' పేరుతో తమ పరువు పోగొట్టుకోవడానికి ఇష్టపడరు.

## విలీనం వైపు.. బాబు చూపు

ఇప్పుడు చంద్రబాబు కూడా విలీనం వైపే మొగ్గుచూపిస్తున్నాడన్నది రాజకీయ మేధావుల మాట. తాను పార్టీలో లేకపోయినా పరవాలేదు జగన్మోహనరెడ్డి దెబ్బకి జైలుకు పోకుండా ఉంటే చాలన్నది ఆయన అభిప్రాయం. ఒక్కొక్కరిగా తెలుగు తమ్ముళ్లను లోపలేసుకుంటూ జగన్ తనదాకా వచ్చేలోగా ఏదో ఒకటి చెయ్యమని మంతనాలు సాగిస్తున్నట్టు సమాచారం.

14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్నాడు, వంద తరాలకు సరిపడా సంపాదించాడు, వయసు మీదపడిపోయింది, ఇలాంటి తరుణంలో పార్టీ, పదవి అని ఊగులాడకుండా ప్రశాంతంగా రిటైర్ కావడమే మంచిదన్నది తెలుగు తమ్ముళ్ల అభిప్రాయం. కడప రెడ్డి ఎత్తుల ముందు చంద్రబాబు జిత్తులు పనికి రావన్నది కూడా వారి అభిప్రాయం.

ఎలాగూ నందమూరి వారసులెవ్వరూ పార్టీ పగ్గాలు చేపట్టడానికి సుముఖంగా లేరు కాబట్టి బీజేపీతో దోస్తీ చేసి విలీనానికి మొగ్గు చూపడమే అన్నివిధాలా ఉత్తమం అని బాబు శ్రేయోభిలాషులే చెప్తున్నారని సమాచారం.

ఈ పథకంలో భాగంగానే ముందుగా శాసనమండలి సభ్యుల్ని ఆ తరువాత మిగిలే ఆరా కొరా శాసనసభ్యుల్ని కూడా త్వరలో బీజేపీలోకి పంపడానికి బాబు రంగం సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

అటు బీజేపీ ఇటు బాబులేని తెలుగుదేశం రెండూ ఒక్కటిగా అవతరించి రాబోయే రోజుల్లో వైసీపీకి ప్రత్యామ్నాయంగా తయారవాలన్నది రాజకీయ వ్యూహంగా మేధావుల అంచనా.

---

# రోశయ్య జన్మదిన వేడుకలు



మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 88వ జన్మదిన వేడుకలను ఈనెల 4న హైదరాబాద్ లోని ఆయన నివాసంలో కుటుంబసభ్యులు, కొంతమంది మిత్రులతో కలిసి నిరాడంబరంగా జరుపుకున్నారు. అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షులు, నెల్లూరీయులు కెవి చలమయ్య ఆయన్ను కలుసుకుని జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారు, శ్రీ తల్పగిరి రంగనాథస్వామి, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు, శ్రీ పెనుశిల లక్ష్మీ నరశింహస్వామి, సూళ్ళూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను రోశయ్యకు అందజేసి శాలువతో సత్కరించారు.

---

### వికలాంగులకు

# జడ్పీ వాకర్స్ నిత్యావసరాలు



జడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సభ్యులు కె.తిరువళ్ళూరు సతీ మణి స్వర్గీయ సులోచన 8వ వర్థంతిని పురస్కరించుకుని వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈనెల 9న నెల్లూరు పెద్దాసుపత్రి ఎదురుగా వున్న పోలీస్ కాలనీ లోని కారుణ్య సేవా సంస్థలోని వికలాంగులకు నిత్యావసర సరుకులు, గ్లౌజులు, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి మెట్టు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో అన్నార్తుల ఆకలి బాధలను, ఎస్సీ ఎస్టీ ప్రాంతాల్లో వున్న వారి సమస్యలను తెలుసుకుని తమ సంస్థ ఆధ్వర్యంలో ఈ 10వ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, కారుణ్య సేవా సంస్థ ఫౌండర్ వెంకటేశ్వర్లు, రూడ్స్ సభ్యులు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## కరోనా కట్టడిలో సైతం..

# సత్తా చాటుతున్న.. మన సతీష్‌రెడ్డి

**● ఢిల్లీలో 1000 పడకలతో కోవిడ్ ఆసుపత్రి నిర్మాణం**

***ఢిల్లీలో ఇటీవల 10వేల పడకలతో ప్రపంచంలోనే అతిపెద్ద కోవిడ్ ఆసుపత్రి కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో సిద్ధం కాగా, అదే సందర్భంలో డిఆర్‌డిఓ ఆధ్వర్యంలో నిర్మించిన 1000 పడకల కోవిడ్ ఆసుపత్రి కూడా ప్రారంభం కావడం విశేషం. కరోనా నియంత్రణకు కేంద్రం అత్యంత వేగవంతంగా చేపట్టిన ఈ ఆసుపత్రులు కరోనా బారిన పడుతున్నవారికి చికిత్సలందించేందుకు, కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు ఎంతగానో ఉపకరించనున్నాయి.***

దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి నెల్లూరు ఖ్యాతి రెపరెపలాడింది. మన నెల్లూరీయుడు, ఆత్మకూరు నియోజకవర్గంలోని మహిమలూరు గ్రామ నివాసి, భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) ఛైర్మెన్ గుండ్రా సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేవలం 12 రోజుల్లోనే వెయ్యి పడకల కోవిడ్ ఆసుపత్రి సిద్ధం కావడం ఎంతైనా అపూర్వం. ఢిల్లీలో ప్రాణాంతకమైన కరోనా మహమ్మారి వ్యాధి బారినపడుతున్న వారికి అవసరమైన చికిత్సలు చేసేందుకు కేంద్రప్రభుత్వం సూచనలతో.. సతీష్‌రెడ్డి సారధ్యంలో ఆగమేఘాల మీద ఈ అధునాతనమైన వెయ్యి పడకల ఆసుపత్రి సిద్ధం కావడం ఎంతో అరుదైన.. అపురూపమైన విషయం. ఈ ఆసుపత్రికి 'సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కోవిడ్ హాస్పిటల్'గా నామకరణం చేశారు కూడా.

### చిన్నతనం నుంచీ దేశభక్తి.. దేశ సేవాసక్తి :

చిన్ననాటి నుంచి దేశభక్తిని పుణికిపుచ్చుకున్న సతీష్‌రెడ్డికి సేవాభిలాష ఎక్కువ. ఎంతో కష్టపడి చదువుకుని శాస్త్రవేత్తగా రాణిస్తూ ఎన్నో ఘనవిజయాలను సాధించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఎన్నో విశిష్టమైన అవార్డులను కూడా అందుకున్నారు. దేశానికి తనవంతు సేవలందించాలనే తపన ఆయనలో ఎప్పుడూ నిండుగా మెండుగా ఉండేది. కఠోరదీక్షతో, అమోఘమైన పరిజ్ఞానంతో శాస్త్రవేత్తగా అందరిలోనూ మిన్నగా రాణించేవారు. దేశసేవకే పరితపించేవారు. ఆ సేవాభిలాషే ఆయన్ను అందల మెక్కించింది. అంచలంచెలుగా ఎదుగుతూ ఇప్పుడు దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థకు ఛైర్మెన్‌గా నేతృత్వం వహిస్తున్నారు సతీష్‌రెడ్డి. దేశవ్యాప్తంగా విశిష్టమైన సేవలందించే అరుదైన అవకాశాలు కూడా ఆయనకిప్పుడు లభిస్తున్నాయి. కరోనా బాధితుల కోసం కేంద్రప్రభుత్వంతో సహా మరెందరో వైద్యులు, నిపుణుల సహకారంతో సతీష్‌రెడ్డి సారధ్యంలో అహర్నిశలు శ్రమించి చేపట్టిన ఈ వెయ్యి పడకల కోవిడ్ ఆసుపత్రి నిర్మాణం.. సతీష్‌రెడ్డి సేవాజీవితంలో ఒక మైలురాయి వంటిదని కూడా చెప్పవచ్చు. దేశరక్షణకు సంబంధించి ఎంతో ఉన్నతస్థాయిలో ఉంటూ దేశానికి, ప్రజలకు, ప్రస్తుత పరిస్థితుల్లో కరోనా మహమ్మారి వ్యాధితో విలవిలలాడుతున్న బాధితులకు కూడా ప్రత్యక్షంగా.. పరోక్షంగా సతీష్‌రెడ్డి చేస్తున్న అపూర్వమైన సేవలు ఒక్క సింహపురి సీమకే కాదు, తెలుగుజాతికే.. మొత్తంగా దేశానికే గర్వకారణం.

### ఆసుపత్రిని సందర్శించిన కేంద్రమంత్రులు :

ఢిల్లీలో కోవిడ్ కేసులు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కరోనా వ్యాధి నియంత్రణ బాధ్యతలను ప్రధాని మోడీ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు అప్పగించడంతో బాధితులకు సత్వర చికిత్సలందించే ఆసుపత్రుల నిర్మాణానికి కేంద్ర హోంశాఖ హుటాహుటిన రంగంలోకి దిగింది. దక్షిణ ఢిల్లీలో కేవలం పదిరోజుల్లోనే ప్రపంచంలోనే అతిపెద్దస్థాయిలో 10,200 పడకలతో అత్యంత అధునాతనమైన రీతిలో శరవేగంగా ఆసుపత్రిని నిర్మించారు. దీంతోపాటు డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి నేతృత్వంలో ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరలోనే వెయ్యి పడకలతో మరో ఆసుపత్రిని సిద్ధం చేశారు. ఈ ఆసుపత్రి నిర్మాణానికి కేంద్ర హోంశాఖ, కేంద్ర వైద్యఆరోగ్య, కుటుంబసంక్షేమశాఖలతో పాటు సాయుధ దళాలు, టాటా సన్స్, డిఆర్‌డిఓ సిబ్బంది తదితరులంతా సహకరించారు. డిఆర్‌డిఓ ఛైర్మెన్ సతీష్‌రెడ్డి పర్యవేక్షణలో రేయింబవళ్ళు కఠోరశ్రమతో ఈ అధునాతన ఆసుపత్రి నిర్మాణాన్ని పూర్తిచేయడం చెప్పుకోదగ్గ విషయం. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి ఈనెల 5న ఈ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ సాయుధ బలగాలకు చెందిన వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది ఈ ఆసుపత్రిని నిర్వహిస్తారని తెలిపారు. ఢిల్లీలో కోవిడ్ వైరస్‌ను నియంత్రించేందుకు ఈ ఆసుపత్రులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొంటూ, ఆసుపత్రుల్లో బాధితులకు ఏర్పాటుచేసిన వసతులు, ఏర్పాట్లను ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి కేంద్రమంత్రులకు వివరించారు.

# అ'సామాన్య' పాలన

## --- ప్రజల గుండెల్లో దేవుడిగా జగన్ ---



పరిపాలన ప్రజాహితంగా, సామాన్యుడికి శ్రేయోదాయకంగా ఉండాలంటే విద్య, వైద్యం ప్రభుత్వం ఆధీనంలోనే ఉండి తీరాలి. ప్రైవేటు రంగానికి కొంత భాగస్వామ్యం ఇచ్చినప్పటికీ అది ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా సంస్థలు, వైద్యశాలలను అచేతనంగా మార్చకూడదు. ప్రైవేటు భాగస్వామ్యం పెరిగే కొద్దీ ఈ సేవలు సంపన్నుల చెంతకు చేరిపోయి సామాన్యుడికి అందని ద్రాక్షగా మారుతాయి. అయితే మన రాష్ట్రంలో ఈ రెండింటిలో ప్రైవేటు రంగం ఇప్పటికే కోరలు చాచి విస్తరించి ఉంది. పేద వాళ్ల చెమట చుక్కలు కార్పొరేట్ శక్తుల ధన దాహానికి హారతి కర్పూరంలా ఆవిరైపోతున్న దుస్థితిని అర్థం చేసుకున్నాడు మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి. సామాన్యులను రక్షించే బాధ్యతను తలకెత్తుకున్నాడు. గత ఏడాది 'అమ్మ ఒడి' పేరుతో పేద పిల్లలను చదివించే బాధ్యతను తానే తీసుకున్నాడు. ఇప్పుడు వైద్యరంగంలో 104, 108 వాహనాలను పునరుద్ధరించాడు. ఏకంగా 1088 వాహనాలతో ఈ సేవలను విస్తరించాడు. గ్రామగ్రామానికీ వైద్యాన్ని చేరువ చేస్తున్నాడు. చంటిబిడ్డల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. ఇది సామాన్యుని శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి తీసుకున్న అసామాన్య నిర్ణయం.

### గత తప్పిదాలను సరిదిద్దుతూ..

మన రాష్ట్రాన్ని పాలించిన గత ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు తీరని అన్యాయం చేసింది. ఆ పాలకులు ఈ విషయంలో చాలా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. విద్య, వైద్య రంగ వ్యవస్థలనూ పకడ్బందీగా అచేతన పరిచారు. అనారోగ్యం వస్తే నూట ఎనిమిది పలికేది కాదు. పిల్లలకు అక్షరాలు నేర్పించుకుందామంటే తమ వాడలో ప్రభుత్వ బడి ఉండేది కాదు. అంతకు ముందెప్పుడో పెట్టిన బడిని పిల్లలు తగినంతగా లేరనే వంకతో రద్దు చేసేసింది గత ప్రభుత్వం. ఆ స్కూలు గదులు అరాచక శక్తులకు నిలయంగా మారిపోయాయి. 'తమకు అన్యాయం' ఏరకంగా జరిగిందో సామాన్యులు తెలుసుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మారుమూల గ్రామాల్లో ఆ ప్రభుత్వం కొత్త పాఠశాలలను పెట్టకపోగా ఉన్న పాఠశాలలను కూడా క్రమంగా కుదించుకుంటూ వచ్చింది. ప్రైవేట్ రంగం విస్తరించడానికి అనువైన పరిస్థితులను చాలా వ్యూహాత్మకంగా కల్పించింది. ప్రభుత్వ పాఠశాలలు లేని గ్రామాలను చూపించవచ్చేమోకానీ ప్రైవేట్ స్కూళ్లు లేని గ్రామాలు లేవనే స్థాయిలో రాష్ట్రాన్ని కార్పొరేట్ పడగ నీడలోకి చేర్చారు గత పాలకులు. ఆ తప్పిదాలను ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ వస్తున్నాడు నేటి సీఎం.

### అందుకే నాడు-నేడు..

అందరికీ అక్షర భాగ్యం కల్పించే బాధ్యతను కూడా తీసుకున్నారు ముఖ్యమంత్రి. అయితే విద్యావ్యవస్థలో విస్తరించిన అలసత్వం ఈ నాటిది కాదు. ఇది అమ్మఒడితో తీరేది కాదు. ఇప్పటికీ చాలా స్కూళ్లలో తగినంత మంది టీచర్లు లేరు. మనకు విద్యావేత్తలు ఉపాధ్యాయులు - విద్యార్థుల నిష్పత్తిని ఖచ్చితంగా సూచించారు. వారి ప్రకారం ముప్పైమంది విద్యార్థులకు ఒక టీచర్ తప్పనిసరిగా ఉండాలి. ఆ నిబంధనను గత పాలకులు తమకు సౌకర్యంగా మలుచుకున్నారు. ఉదాహరణకు ఒక గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు మొత్తం ముప్పై మంది విద్యార్థులే ఉంటే ఆ స్కూల్‌కి ఒక టీచర్ పోస్టు మాత్రమే శాంక్షన్ అవుతుంది. ఐదు తరగతులకూ ఆ ఒక్క టీచరే చదువు చెప్పాలి. ఒకవేళ మొత్తం విద్యార్థులు యాభై నుంచి అరవై మంది వరకు ఉంటే అప్పుడు రెండో టీచర్ పోస్టు ఇస్తారు. ఆ ఇద్దరు టీచర్లు ఐదు తరగతులకు పాఠాలు చెప్పాల్సి ఉంటుంది. యుద్ధప్రాతిపదికన టీచర్ల నియామకం జరిగి ప్రతి తరగతికీ ఒక టీచర్‌ను నియమించడం ఇప్పుడు ప్రభుత్వం ముందున్న బాధ్యత. అందుకే ఇప్పుడు 'నాడు-నేడు' కార్యక్రమంతో పాత బడులకు కొత్తరూపం, పరిపూర్ణ బోధనా సిబ్బంది నియామకాలకు శ్రీకారం.

### దైవసమానం

విద్య, వైద్యం రెండూ దైవ సమానం. బడి అంటే అక్షరాల గుడి. హాస్పిటల్ అయితే ఏకంగా వైద్యం అందించే ఆలయం. అందుకే పాలకులు ఈ రెండు సేవలను తమ ఆధీనంలోనే ఉంచుకుని సమర్థంగా నిర్వహించి తీరాలి. అప్పుడే పేదవాళ్లు ధైర్యంగా జీవించగలుగుతారు. తమ పాలకుడే తమకు కొండంత అండ అనే భరోసా వారిలో కలుగుతుంది. ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రేయోరాజ్య పాలనతో ప్రజలకు ఆ భరోసా కలిగించాడు. అందుకే ప్రజలందరూ పాలనతో మమేకమవుతున్నారు. ప్రజల్లో ప్రతి వర్గమూ తన వంతుగా ప్రయోజనం పొందుతోంది.

ఆ రంగం, ఈ రంగం అని కాకుండా ప్రతి రంగంలోనూ ప్రజాహితమే ధ్యేయంగా సుపరిపాలనే లక్ష్యంగా తాను అందించే ప్రతి పథకం సామాన్యుడి గడపకు చేరాలనే తపనతో అ'సామాన్య' పాలనను కొనసాగిస్తున్నాడు జగన్.

తన మీద నమ్మకం, విశ్వాసం పెట్టుకున్న నవ్యాంధ్ర ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలను నెరవేరుస్తూ.. వారి కష్టాలను తీరుస్తున్నాడు కాబట్టే... ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రజల గుండెల్లో దైవమై నిలిచాడు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, e-mail: roopagroup@yahoo.com